# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 77, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) బుధవారం -04 - జూన్ - 2025


## 24 గంటల్లో 1,430 ఉక్రెయిన్ సైనికులు హతం: రష్యా




- కీవ్‌లో డ్రోన్లు, క్షిపణులు, సాయుధ పోరాట వాహనాలు, ఫిరంగి తుపాకులను ధ్వంసం
- మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధంలో తమ సైన్యం దాదాపు 1 మిలియన్ రష్యన్ సైనికులను హతమార్చింది

## తుని రైలు దగ్ధం కేసు... ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం




తుని రైలు దగ్ధం కేసులో అప్పీల్‌కు వెళ్లొద్దని ప్రభుత్వ నిర్ణయం

రైల్వే కోర్టు తీర్పుపై అప్పీల్ ఉత్తర్వులు రద్దుకు ఆదేశం

అప్పీల్ ఫైల్ ఆమోదంపై ప్రభుత్వ ఆరా

## ఆపరేషన్ సిందూర్ అనంతరంతొలిసారి జమ్మూ కాశ్మీర్‌కి

చీనాబ్ రైల్వే బ్రిడ్జిని ప్రారంభించి, ఉగ్రవాదం అణచివేతకు సంబంధించిన కీలక ప్రకటనలు చేయనున్నారు




ఢిల్లీ: ఈనెల 6న ప్రధాని నరేంద్రమోదీ జమ్మూకాశ్మీర్‌లో పర్యటించనున్నారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం ఆయన తొలిసారి జమ్మూ కాశ్మీర్ సందర్శించడం. ఈ పర్యటనలో మోదీ చీనాబ్ రైల్వే బ్రిడ్జిని ప్రారంభించి, ఉగ్రవాదం అణచివేతకు సంబంధించిన కీలక ప్రకటనలు చేయనున్నారు. మిగతా..2లో

# త్వరలో ఏపీ లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటు

- పోర్టులు, ఫిషింగ్ హార్బర్లను రాష్ట్ర సంపదగా తీర్చిదిద్దాలి
- తొలిదశలో అమరావతి, కుప్పం, దగదర్తి, శ్రీకాకుళం ఎయిర్‌పోర్టుల నిర్మాణం పూర్తి చేయాలి



అమరావతి: పోర్టులు, ఫిషింగ్ హార్బర్లను రాష్ట్ర సంపదగా తీర్చిదిద్దాలని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పోర్టులు, ఎయిర్‌పోర్టులు, ఫిషింగ్ హార్బర్లపై సీఎం సమీక్ష నిర్వహించారు. వచ్చే ఏడాదికి 4 పోర్టులు, 4 హార్బర్లు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. త్వరలో ఏపీ లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. తొలిదశలో అమరావతి, కుప్పం, దగదర్తి, శ్రీకాకుళం ఎయిర్‌పోర్టుల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. పీపీపీ విధానంలో రద్దీ మేరకు రాష్ట్ర రహదారుల విస్తరణ చేపట్టనున్నట్టు వివరించారు. హైవేలతో అన్ని రాష్ట్ర రహదారులను అనుసంధానం చేయాలని సీఎం ఆదేశించారు. మచిలీపట్నం పోర్టు మొదటి దశ పనులు 43.25 శాతం పూర్తికాగా.. వచ్చే ఏడాది నవంబర్ నాటికి మొత్తం పనులు పూర్తికానున్నాయని అధికారులు సీఎంకు వివరించారు. రామాయపట్నం పోర్టు మొదటి దశ పనులు 63.89 శాతం, మూలపేట పోర్టు మొదటిదశ పనులు 46.59 శాతం, కాకినాడ గేట్‌వే పోర్టు పనులు 29.92 శాతం పూర్తయ్యాయని తెలిపారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ మొదటి దశ నిర్మాణం పనులు 97.72 శాతం, నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ మొదటి దశ పనులు 81.17 శాతం, మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ మొదటి దశ పనులు 69.20 శాతం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ మొదటి దశ పనులు 78.94 శాతం పూర్తయ్యాయని అధికారులకు సీఎంకు తెలిపారు.



## దేశంలో 4 వేలు దాటిన యాక్టివ్ కేసులు.. 24 గంటల్లో ఐదు కొత్త మరణాలు

- ఏడాది జనవరి నుంచి దేశంలో 37 మరణాలు
- కేరళ అత్యంత ప్రభావితమైన రాష్ట్రంగా కాగా, తరువాత మహారాష్ట్ర, గుజరాత్,ఢిల్లీలో ఉన్నాయి
- మే 22 నాటికి దేశంలో 257 మంది యాక్టివ్ రోగులు




## నడిరోడ్డుపై కొట్టే అధికారం పోలీసులకు ఎవరిచ్చారు?

తెనాలి: రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాష్ట్రం అదుపు తప్పిందని.. పోలీస్ వ్యవస్థ దిగజారిపోయిందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తెనాలిలో పర్యటించిన ఆయన.. పోలీసుల చేతిలో హింసకు గురైన యువకుల కుటుంబాలను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగంతో చంద్రబాబు పోలీస్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారు. ప్రశ్నించే గొంతులను అణగదొక్కుతున్నారు. మాజీ మంత్రులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కేసులు పెడుతున్నారు. రెడ్‌బుక్‌తో వేధించి హింసిస్తున్నారు. పోలీస్ వ్యవస్థ వికృత రూపానికి తెనాలి ఘటనే సాక్ష్యం. తెనాలి పోలీసుల చేతిలో దళితులు, మైనారిటీల ముగ్గురు పిల్లలు దెబ్బలు తిన్నారు. రాకేష్ హైదరాబాద్‌లో జొమాటోలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఆ యువకుడు తెనాలిలోనే ఉండడం లేదు. పాత కేసులో వాయిదా కోసం తెనాలికి వచ్చాడు. రాకేష్‌ను చూడడానికి అతని స్నేహితులు వచ్చారు. వాళ్లు కూడా మంగళగిరి నుంచి వచ్చారు. జాన్ విక్టర్ జూనియర్ అడ్వకేట్. బార్ కౌన్సిల్‌లో సభ్యత్వం కూడా ఉంది. ఐతా నగర్‌లో సివిల్ డ్రెస్‌లో ఉన్న




## భారత్‌తో వాణిజ్య ఒప్పందం ఎంతో దూరంలో లేదు: అమెరికా

- త్వరలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం ఖరారు
- ఇరు దేశాలకు ఆమోదయోగ్యమైన ఒప్పందం అంటున్న అమెరికా వాణిజ్య కార్యదర్శి
- జులై 8 లోపు 26 శాతం సుంకం మినహాయింపు కోరుతున్న భారత్

## ఈ నెల 5న కేబినెట్ సమావేశం.. కీలక అంశాలపై చర్చ



హైదరాబాద్: రాష్ట్రంలో కొనసాగుతోన్న తెలంగాణ ప్రభుత్వం కీలక అభివృద్ధి, పరిపాలనా అంశాలపై చర్చించేందుకు జూన్ 5న కేబినెట్ సమావేశం నిర్వహించనుంది. మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్ర సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం కీలక నిర్ణయాలకు వేదికకానుంది. ఈ సమావేశంలో పలు ముఖ్య అంశాలపై చర్చ జరగనుంది. ముఖ్యంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఇచ్చిన నివేదికపై ఈ సమావేశంలో విశ్లేషణ జరగనుంది. పాత పింఛన్ విధానం, ప్రమోషన్లు, బదిలీలు, ఖాళీల భర్తీ తదితర అంశాలపై తీసుకునే నిర్ణయాల కోసం ఇది కీలకంగా మారింది. వివాదాస్పదంగా మారిన కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇటీవల ఎన్డీఎస్ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ), విజిలెన్స్ విభాగాలు సమర్పించిన నివేదికలపై కేబినెట్‌లో చర్చించనున్నారు. లోపాల పరిశీలన, బాధ్యుల నిర్ధారణ, తదుపరి చర్యలపై మంత్రివర్గం నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. యువత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రాజీవ్ యువ వికాసం' పథకం అమలు అంశంపై కూడ కేబినెట్ చర్చించనుంది. ఇందులో భాగంగా యువతకు శిక్షణ, ఉపాధి అవకాశాలు, స్కిల్లింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి అంశాలు చర్చకు రానున్నాయి. ఈ సమావేశం ద్వారా రాష్ట్ర పరిపాలనలో కీలక మలుపులు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో సానుకూల నిర్ణయాలు తీసుకునే సూచనలు కనిపిస్తున్నాయి.

## అత్యంత పారదర్శకంగా 'భూభారతి'

- మనుషులకు ఆధార్ లాగే భూములకు త్వరలో భూధార్‌ను తీసుకొస్తాం
- కొత్త చట్టాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ సదస్సులు నిర్వహిస్తున్నాం



ఖమ్మం: రైతులకు ఎంతో ఉపయోగపడేలా 'భూభారతి' చట్టాన్ని జాగ్రత్తగా రూపకల్పన చేశామని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమాడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మిగతా..2లో

# కెనడా జీ7 సదస్సుకు భారత్‌కు అందని ఆహ్వానం..

- ఆరేళ్లలో ఇదే మొదటిసారి!
- కెనడా జీ7 సదస్సుకు భారత్‌కు ఇంకా అందని ఆహ్వానం
- ఆరేళ్లలో తొలిసారి మోదీ గైర్హాజరయ్యే సూచనలు
- ఇది దౌత్యపరమైన భంగపాటంటూ కాంగ్రెస్ పార్టీ విమర్శ
- భారత్-కెనడా మధ్య ఉద్రిక్తతలే కారణమనే ఊహాగానాలు




ఢిల్లీ: కెనడా ఆతిథ్యమిస్తున్న ప్రతిష్ఠాత్మక జీ7 కూటమి శిఖరాగ్ర సమావేశానికి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈసారి దూరంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ పరిణామంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఇది దౌత్యపరమైన వైఫల్యమని పేర్కొంది. ఆరేళ్ల కాలంలో ప్రధాని మోదీ జీ7 సమావేశానికి హాజరుకాకపోవడం ఇదే తొలిసారి. కెనడాలోని అల్బెర్టా ప్రాంతంలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు జీ7 దేశాల శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఈ సమావేశంలో పశ్చిమాసియాలోని ఉద్రిక్త పరిస్థితులు, రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం, ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న ఇతర కీలక సవాళ్లపై సభ్య దేశాల అధినేతలు చర్చించనున్నారు. అయితే, ఈ కీలక భేటీకి హాజరుకావాల్సిందిగా భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ఆహ్వానం అందలేదు. ఒకవేళ చివరి నిమిషంలో ఆహ్వానం లభించినప్పటికీ, ప్రస్తుతం భారత్-కెనడా మధ్య నెలకొన్న మిగతా..2లో




## రాజధాని నుంచి రాయలసీమకు రాచమార్గం

ఎక్కడెక్కడ రెండు, నాలుగు వరుసలు

| పరిధి | కి.మీ. | వరుసలు |
|---|---|---|
| అనంతపురం- బుగ్గ | 69 | 4 |
| బుగ్గ- గిద్దలూరు | 135 | 4 |
| గిద్దలూరు- వినుకొండ | 110 | 2 |
| వినుకొండ- గుంటూరు | 84.8 | 4 |

అమరావతి: గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో అనంతపురం నుంచి అమరావతి వరకు యాక్సెస్ కంట్రోల్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధమైంది. దానికి కేంద్రం జాతీయ రహదారి సంఖ్యను కూడా కేటాయించింది. తర్వాత వైకాపా ప్రభుత్వం.. ఈ ప్రాజెక్టును పూర్తిగా పక్కనపెట్టింది. దీంతో కేంద్రం ప్రత్యామ్నాయంగా అనంతపురం నుంచి గుంటూరు



## 5న విచారణకు హాజరు కాలేను!

మరో గడువు ఇవ్వాలని కోరిన మాజీ సీఎం కేసీఆర్

5న కేసీఆర్, 6న ఈటల, 9న హరీశ్‌రావులు హాజరుకావాలి

నేడు హైదరాబాద్‌కు ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్

హైదరాబాద్: కాళేశ్వరం బ్యారేజీల్లోని అవకతవకలపై విచారణ చేస్తున్న కమిషన్ ఎదుట ఈ నెల 5న హాజరు కాలేనంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కమిషన్‌కు విన్నవించారు. మరో తేదీన వస్తానని, గడువు ఇవ్వాలని కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్‌ను కోరారు. దీంతో కమిషన్ సానుకూలంగా స్పందించి... ఈ నెల 11న రావాలని సూచించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై న్యాయ విచారణ చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ మే 19న మాజీ సీఎం కేసీఆర్, నాటి మంత్రులు ఈటల రాజేందర్(ఆర్థిక), తన్నీరు హరీశ్‌రావు(నీటిపారుదల)లకు నోటీసులు పంపింది. 5న కేసీఆర్, 6న ఈటల, 9న హరీశ్‌రావులు హాజరుకావాలని సూచించింది. ఈ క్రమంలో కమిషన్ ఎదుట హాజరై తమ మిగతా..2లో

## 24 గంటల్లో 1,430 ఉక్రెయిన్ సైనికులు హతం: రష్యా

రష్యా-ఉక్రెయిన్ : ఒక వైపు రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం చర్చలకు సన్నాహాలు జరుగుతున్నప్పటికీ మరోవైపు ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. గత 24గంటల్లో ఉక్రెయిన్‌పై తమ బలగాలు చేసిన దాడుల్లో 1,430 మందికి పైగా ఆ దేశ సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. కీవ్‌లో డ్రోన్లు, క్షిపణులు, సాయుధ పోరాట వాహనాలు, ఫిరంగి తుపాకులను ధ్వంసం చేశామన్నారు. మరో వైపు మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధంలో తమ సైన్యం దాదాపు 1 మిలియన్ రష్యన్ సైనికులను హతమార్చిందని ఉక్రెయిన్ సాయుధ దళాల జనరల్ స్టాఫ్ ఆఫీస్ ప్రకటించింది. యుద్ధంలో మొత్తం 9,90,800 మంది రష్యన్ సైనికులు మరణించారని..అందులో 1,100 మంది సైనికులు గత 24 గంటల్లో మరణించారని పేర్కొంది. తమ దాడుల్లో రష్యా 10,881 ట్యాంకులు, 22,671 సాయుధ పోరాట వాహనాలు, 50,607 ఇంధన ట్యాంకులు, 28,623 ఫిరంగి వ్యవస్థలు, 1,402 బహుళ ప్రయోగ రాకెట్ వ్యవస్థలు, 1,176 వైమానిక రక్షణ వ్యవస్థలు, 384 విమానాలు, 41 యుద్ధ విమానాలు, 336 హెలికాప్టర్లు, 38,748 డ్రోన్లు, 28 నౌకలు, ఒక జలాంతర్గామిని కోల్పోయిందని ఉక్రెయిన్ జనరల్ స్టాఫ్ తెలిపారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య సోమవారం తుర్కియేలోని ఇస్తాంబుల్‌లోని సిరగాన్ ప్యాలెస్‌లో తుర్కియే విదేశాంగశాఖ మంత్రి హకన్ ఫిదాన్ అధ్యక్షతన సోమవారం రష్యా, ఉక్రెయిన్ ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. కాల్పుల విరమణ షరతులపై వారు చర్చించారు. అవి ఫలితమిచ్చినట్లు ఏ వర్గమూ ప్రకటించలేదు. ఈ చర్చలకు ముందు ఉక్రెయిన్ రష్యాపై అతిపెద్ద దాడి చేయడం గమనార్హం. దీనికి ప్రతిగా మాస్కో సైతం ఉక్రెయిన్‌లో 1,000 కిలోమీటర్ల దూరం వెళ్లి.. 472 డ్రోన్‌లతో విరుచుకుపడింది.

## రిజిస్ట్రేషన్ బిల్లు-2025 ముసాయిదా విడుదల

ఢిల్లీ: దేశవ్యాప్తంగా ప్రాపర్టీ డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లను ఆధునీకరించేందుకు ఉద్దేశించిన రిజిస్ట్రేషన్ బిల్లు-2025 ముసాయిదాను కేంద్రం ఆవిష్కరించింది. ఈ ప్రతిపాదిత చట్టం సమకాలీన డిమాండ్లకు సరిపోని నాటి 1908 రిజిస్ట్రేషన్ చట్టాన్ని భర్తీ చేయడానికి ఏర్పాటు చేశారు. కొత్త బిల్లు ఆస్తి రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్ వ్యవస్థకు మద్దతుగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. తద్వారా బ్యూరోక్రసీ, మధ్యవర్తుల అవసరం తగ్గనుంది. ప్రాపర్టీ డాక్యుమెంటేషన్‌పై ఆధారపడిన ఆర్థిక లావాదేవీలు, చట్టపరమైన నిర్ణయాలు, పరిపాలనా సేవలను క్రమబద్ధీకరించే విస్తృత ప్రయత్నంలో భాగంగా ఈ చర్యలు చేపట్టారు. భూ దందాల్లోనే కాకుండా వివిధ ఆర్థిక, చట్టపరమైన కార్యకలాపాల్లో కూడా ప్రాపర్టీ డాక్యుమెంట్లు కీలక పాత్ర పోషిస్తున్నందున ఈ మార్పులు ప్రాధాన్యత చోటుచేసుకుంటున్నాయి. 1908 రిజిస్ట్రేషన్ చట్టం ఆన్‌లైన్ డాక్యుమెంట్ నిర్వహణ, డిజిటల్ ఐడెంటిటీ వెరిఫికేషన్ వంటి ఆధునిక అవసరాలకు అనుగుణంగా రూపొందించబడలేదు. ఈ వెసులుబాట్లు టెక్నాలజీ పెరుగుతున్న ఈ రోజుల్లో అత్యవసరంగా మారాయి. ప్రాపర్టీ డాక్యుమెంట్లు ఇప్పుడు కేవలం భూ దందాలకు మాత్రమే కాకుండా వివిధ ఆర్థిక, చట్టపరమైన కార్యకలాపాలకు కీలకంగా మారుతున్నాయి. అనేక రాష్ట్రాలు ఇప్పటికే ఆన్‌లైన్ అప్‌లోడలు, ఆధార్ ఆధారిత ధ్రువీకరణను అమలు చేస్తున్నాయి. అందుకు అనుగుణంగా దేశం అంతటా స్థిరమైన, విశ్వసనీయమైన వ్యవస్థను స్థాపించడానికి కొత్త చట్టం అవసరమని భావిస్తున్నారు. ఈ ఏకరూపత పౌరులందరికీ సమర్థవంతమైన, సురక్షితమైన ఆస్తి రిజిస్ట్రేషన్ ప్రక్రియలకు అవకాశం కల్పిస్తుందని భావిస్తున్నారు.

ప్రతిపాదిత అంశాలు..

గృహ కొనుగోలుదారులకు ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత అందుబాటులోకి తీసుకురావడం, సమర్థవంతంగా నిర్వహించడం కొత్త బిల్లులోని ప్రధానాంశాల్లో ఒకటి. ప్రతిపాదిత విధానంలో పౌరులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పదేపదే వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆస్తి పత్రాలను డిజిటల్‌గా నమోదు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ ద్వారా పేపర్ వర్క్ తగ్గుతుందని, ప్రక్రియలను వేగవంతం చేస్తుందని, మధ్యవర్తులపై ఆధారపడటాన్ని పరిమితం చేస్తుందని భావిస్తున్నారు. ఆస్తుల లావాదేవీలకు డిజిటల్ రికార్డులను తప్పనిసరి చేయడం ద్వారా చట్టపరమైన రక్షణ పెరుగుతుంది. ఈ చర్యతో అమ్మకం ఒప్పందాలు, తనఖా పత్రాలు, సేల్ సర్టిఫికేట్లు వంటి కీలక డాక్యుమెంట్ల చట్టబద్ధత మెరుగుపడుతుందని భావిస్తున్నారు. డిజిటల్-ఫస్ట్ విధానాన్ని అవలంబించడం ద్వారా, ఆస్తి లావాదేవీలను మరింత పారదర్శకంగా, సురక్షితంగా చేయడమే ఈ బిల్లు లక్ష్యం.

### దేశంలో 4 వేలు దాటిన యాక్టివ్ కేసులు..

## 24 గంటల్లో ఐదు కొత్త మరణాలు

ఢిల్లీ: మంగళవారం (జూన్ 3, 2025) విడుదల చేసిన కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం, భారతదేశంలో యాక్టివ్ కొవిడ్-19 కేసులు 4,000 మార్కును దాటాయి, కేరళ అత్యంత ప్రభావితమైన రాష్ట్రంగా కాగా, తరువాత మహారాష్ట్ర, గుజరాత్,ఢిల్లీలో ఉన్నాయి. మంగళవారం (జూన్ 3, 2025) విడుదల చేసిన కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం, భారతదేశంలో యాక్టివ్ కొవిడ్-19 కేసులు 4,000 మార్కును దాటాయి, కేరళ అత్యంత ప్రభావితమైన రాష్ట్రంగా కాగా, తరువాత మహారాష్ట్ర, గుజరాత్,ఢిల్లీలో ఉన్నాయి. దేశంలో 4,026 యాక్టివ్ కేసులు ఉన్నాయి మరియు గత 24 గంటల్లో ఐదు కొత్త మరణాలు నమోదయ్యాయి. ఈ ఏడాది జనవరి నుంచి దేశంలో 37 మరణాలు సంభవించాయి. మే 22 నాటికి దేశంలో 257 మంది యాక్టివ్ రోగులు ఉన్నారు. మే 31 నాటికి ఈ సంఖ్య 3,395కి, ఆ తర్వాత 4,026 కేసులకు పెరిగింది. ప్రస్తుతం కేరళలో 1,416 యాక్టివ్ కేసులు ఉన్నాయి, దేశంలో అత్యధికంగా మహారాష్ట్ర 494, గుజరాత్ 397, ఢిల్లీలో 393 కేసులు ఉన్నాయి. గత 24 గంటల్లో ఐదు మరణాలు - కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో ఒక్కొక్కటి, మహారాష్ట్రలో రెండు మరణాలు సంభవించాయని డేటా తెలిపింది. దేశంలో కొవిడ్-19 పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని, ఇన్ఫెక్షన్ల తీవ్రత తక్కువగా ఉందని, చాలా మంది రోగులు ఇంటి సంరక్షణలో ఉన్నారని, ఆందోళన చెందవలసిన అవసరం లేదని ప్రభుత్వ ఆరోగ్య అధికారులు తెలిపారు. ప్రస్తుత కేసుల పెరుగుదలకు దారితీసిన వైవిధ్యాలు తీవ్రమైనవి కావని, అవి ఓమిక్రాన్ యొక్క ఉప వైవిధ్యాలు మాత్రమేనని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బెహ్ల్ సోమవారం పేర్కొన్నారు. అప్రమత్తంగా ఉండాలి కానీ ఆందోళన చెందడానికి ఎటువంటి కారణం లేదు" అని డాక్టర్ బెహ్ల్ అన్నారు.

### భారత్‌తో వాణిజ్య ఒప్పందం

## ఎంతో దూరంలో లేదు: అమెరికా

భారత్-అమెరికా : భారతదేశం-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం త్వరలోనే ఖరారయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న సుంకాల ప్రతిష్టంభన నేపథ్యంలో చర్చలు ఊపందుకున్నాయని, రెండు దేశాలకూ ఆమోదయోగ్యమైన ఉమ్మడి ప్రయోజనాలపై ఏకాభిప్రాయం కుదిరిందని అమెరికా వాణిజ్య కార్యదర్శి హొవార్డ్ లుట్నిక్ ఆశాభావం వ్యక్తం చేశారు. వాషింగ్టన్‌లో జరిగిన యూఎస్-ఇండియా వ్యూహాత్మక భాగస్వామ్య వేదిక (యూఎస్‌ఐఎస్‌పీఎఫ్) ఎనిమిదో వార్షిక సదస్సులో పాల్గొన్న లుట్నిక్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం సమీప భవిష్యత్తులోనే కుదురుతుందని మీరు ఆశించవచ్చు" అని అన్నారు. ట్రంప్ ప్రభుత్వం వాణిజ్య ఒప్పందాలను వేగవంతం చేయడానికి చేస్తున్న ప్రయత్నాలకు ఈ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయి. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, వాణిజ్య లోటుకు కారణమవుతున్నాయన్న ఆరోపణలతో భారత్ సహా పలు దేశాలపై ప్రతీకార సుంకాలను ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, చైనా మినహా ఇతర దేశాలపై ఈ సుంకాలను జులై 8 వరకు 90 రోజుల పాటు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో తమ వస్తువులపై అమెరికా విధించిన 26 శాతం అదనపు సుంకం నుంచి భారత్ పూర్తి మినహాయింపు కోరుతోంది. ఈ నేపథ్యంలో జులై 8 లోపు మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసుకునేందుకు ఇరు దేశాలు ప్రయత్నిస్తున్నాయని వార్తలు వస్తున్న తరుణంలో లుట్నిక్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నిన్న భారత వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ భారత్, అమెరికా పరస్పరం ఒకరి వ్యాపారాలకు మరొకరు ప్రాధాన్యంతో కూడిన మార్కెట్ ప్రవేశం కల్పించాలని కోరుకుంటున్నాయని, ఇరు దేశాల బృందాలు ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. కాగా, ప్రతిపాదిత మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిపేందుకు అమెరికా అధికారుల బృందం ఈ వారం భారత్‌లో పర్యటిస్తోంది. గత నెలలో, భారత ప్రధాన సంప్రదింపుల అధికారి, వాణిజ్య విభాగం ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్ వాషింగ్టన్‌లో నాలుగు రోజుల పర్యటన ముగించారు. వాణిజ్య చర్చలకు మరింత ఊతమిచ్చేందుకు వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కూడా ఇటీవల వాషింగ్టన్‌లో పర్యటించారు.

### ఎంత నష్టం జరిగిందన్నది కాదు...

### ఎలాంటి ఫలితాలు సాధించామన్నదే ముఖ్యం

## త్రివిధ దళాధిపతి అనిల్ చౌహాన్

ఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ సమయంలో కొన్ని యుద్ధ విమానాలను కోల్పోయినట్లు అంగీకరించిన కొద్ది రోజులకే, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. నికార్సయిన సైనిక దళాలు ఎదురుదెబ్బలు లేదా నష్టాల వల్ల ప్రభావితం కావని ఆయన స్పష్టం చేశారు. యుద్ధంలో నష్టాల కంటే ఫలితాలే ముఖ్యమని నొక్కిచెప్పారు. సావిత్రిబాయి ఫులే పుణే విశ్వవిద్యాలయంలో 'భవిష్యత్ యుద్ధాలు - యుద్ధరీతులు' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం ఇస్తూ జనరల్ చౌహాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. "వృత్తిపరమైన దళాలు ఎదురుదెబ్బలు లేదా నష్టాల వల్ల ప్రభావితం కావని నేను భావిస్తున్నాను. యుద్ధంలో ఎదురుదెబ్బలు తగిలినప్పటికీ, మనోధైర్యం ఉన్నతంగా ఉండటం చాలా ముఖ్యం. పరిస్థితులకు తగ్గట్టుగా మారగలగడం అనేది వృత్తిపరమైన సైనిక శక్తికి ముఖ్యమైన లక్షణం. ఏం తప్పు జరిగిందో అర్థం చేసుకోగలగాలి, తప్పును సరిదిద్దుకుని మళ్ళీ ప్రయత్నించాలి. భయంతో కూర్చోకూడదు" అని అన్నారు. పాకిస్థాన్ మరియు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసే క్రమంలో, మే 7న జరిగిన ప్రతిఘటనలో భారత్ కొన్ని యుద్ధ విమానాలను కోల్పోయిందని జనరల్ చౌహాన్ ఇటీవల అంగీకరించిన విషయం తెలిసిందే. ఆ నష్టం తర్వాత భారత దళాలు తమ వ్యూహాలను మార్చుకుని, సరిహద్దుకు ఆవల ఉన్న పాక్ వైమానిక స్థావరాలకు భారీ నష్టాన్ని కలిగించాయని ఆయన వివరించారు. "మే 7న, ఆరంభ దశలో నష్టాలు జరిగాయని నేను చెప్పగలను" అని జనరల్ చౌహాన్ గతంలో పేర్కొన్నారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఘటన ఆధునిక ప్రపంచానికి ఆమోదయోగ్యం కాదని ఆయన తీవ్రంగా ఖండించారు. "పహల్గామ్‌లో జరిగింది బాధితుల పట్ల తీవ్రమైన క్రూరత్వం. ఎందుకంటే వారందరినీ వారి కుటుంబ సభ్యులు, పిల్లల ముందే తలపై కాల్చి చంపారు. మతం పేరుతో వారిని కాల్చిచంపడం ఈ ఆధునిక ప్రపంచానికి ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. పాశ్చాత్య దేశాలు ఒకటి లేదా రెండు ఉగ్రవాద చర్యలను ఎదుర్కొని ఉండవచ్చు. కానీ భారత్ అత్యధిక ఉగ్రవాద దాడులకు గురైంది, దాదాపు 20,000 మంది ప్రాణాలు కోల్పోయారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ సింధూర్ ఇంకా ముగియలేదని, అది కొనసాగుతోందని సీడీఎస్ చౌహాన్ స్పష్టం చేశారు. "ఇది శత్రుత్వాల తాత్కాలిక విరమణ మాత్రమే. మనం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది," అని ఆయన అన్నారు. పాకిస్థాన్ విషయానికొస్తే, నేను రెండు అంచనాలు వేయగలను. ఒకటి, వారు చాలా దూరం నుంచి వేగంగా ఆయుధాలను కోల్పోతున్నారు, ఇది మరికొంత కాలం కొనసాగితే, వారు మరింత నష్టపోయే అవకాశం ఉందని వారు భావించి ఉండవచ్చు, అందుకే వారు కాల్పుల విరమణకు ప్రతిపాదించి ఉంటారు" అని జనరల్ అనిల్ చౌహాన్ విశ్లేషించారు.

## బనకచర్ల ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిస్తున్నాం

హైదరాబాద్: గోదావరి నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిస్తున్నామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అందులోభాగంగా ఈ ప్రాజెక్ట్‌ను అడ్డుకునేందుకు తాము ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ అంశాన్ని ఇప్పటికే కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ దృష్టికి తీసుకు వెళ్లి.. మాట్లాడామన్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్మించకుండా అడ్డుకోవాలని ఆయన్ని కోరామని చెప్పారు. అలాగే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అభ్యంతరాలపై ఇప్పటికే కేంద్రానికి తెలియజేశామన్నారు. ఆ క్రమంలో గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు, కేంద్ర జల్‌శక్తి మంత్రికి లేఖలు రాసినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి ఇంకా ఎలాంటి ప్రయత్నాలు చేయాలో అవన్నీ చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

### ఈనెల 6న జమ్మూకాశ్మీర్‌కు ప్రధాని మోదీ

### ఆపరేషన్ సిందూర్ అనంతరం

## తొలిసారి జమ్మూ కాశ్మీర్‌కి

మొదటి పేజి తరువాయి



కాగా, ఇప్పటికే కేంద్ర మంత్రులు అమిత్ షా, రామ్మోహన నాయుడు, అలాగే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జమ్మూకాశ్మీర్‌లోని సరిహద్దు ప్రాంతాలలో పర్యటించిన విషయం తెలిసిందే. ఇక ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా జమ్మూకాశ్మీర్‌లో పర్యటించారు. పాకిస్థాన్ మద్దతుతో జరిగిన దాడుల్లో దెబ్బతిన్న నివాసాలను పరిశీలించారు. దాడిలో మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిగా భారత్ ప్రభుత్వం పాకిస్థాన్‌పై పలు కఠిన చర్యలు తీసుకుంది. వాటిలో ముఖ్యంగా సింధు నదీ జలాల ప్రవాహాన్ని నిలిపివేయడం, పాకిస్థాన్‌కు ఇచ్చిన వీసాలను రద్దు చేయడం, అటారీ సరిహద్దును మూసివేయడం ఉన్నాయి.

## అత్యంత పారదర్శకంగా 'భూభారతి'

మొదటి పేజి తరువాయి



ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ అత్యంత పారదర్శకంగా భూభారతి చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. కొత్త చట్టాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మనుషులకు ఆధార్ లాగే భూములకు త్వరలో భూధార్‌ను తీసుకొస్తామని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భూభారతి చట్టం తెచ్చామన్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించి భూములను సర్వే చేయిస్తామని తెలిపారు. గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి 3,500 మంది రెవెన్యూ అధికారులను నియమిస్తున్నామని పొంగులేటి చెప్పారు. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే విప్లవాత్మక చట్టాన్ని తమ ప్రభుత్వం తెచ్చిందన్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా.. భూముల సమస్యలు పరిష్కారం కాలేదని చెప్పారు. భూభారతితో రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.

## 5న విచారణకు హాజరు కాలేను!

మొదటి పేజి తరువాయి



ఈ క్రమంలో కమిషన్ ఎదుట హాజరై తమ బాణీ వినిపించేందుకు కేసీఆర్, హరీశ్‌రావులు సన్నద్ధమయ్యారు. ఒకటికి రెండుసార్లు వారిద్దరూ సమావేశమై విచారణలో వివరించాల్సిన అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ఇంతలో కేసీఆర్ విచారణకు మరో తేదీని కోరారు. మరోవైపు కాళేశ్వరం విశిష్టతను పార్టీ శ్రేణులకు, ప్రజలకు తెలియజేయాలని భారాస నిర్ణయించింది. అందులో భాగంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మీడియాకు తెలంగాణభవన్‌లో హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చేందుకు నిర్ణయించగా చివరి సమయంలో వాయిదా వేశారు. నేడు హైదరాబాద్‌కు జస్టిస్ ఘోష్: కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ బుధవారం సాయంత్రం కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. ఐదు నుంచి మలిదశ విచారణ ప్రక్రియను ప్రారంభించనున్నారు.

### నడిరోడ్డుపై కొట్టే అధికారం

## పోలీసులకు ఎవరిచ్చారు?

మొదటి పేజి తరువాయి

ఐతా నగర్‌లో సివిల్ డ్రెస్‌లో ఉన్న కానిస్టేబుల్ ఎవరితో గోవడ పడుతుంటే ఈ యువకులు అడ్డుకున్నారు. గొడవపడుతున్న కానిస్టేబుల్‌ను వీళ్లు ప్రశ్నించారు. కేవలం కానిస్టేబుల్‌ను ప్రశ్నించడం వీళు చేసిన తప్పా?. ఏప్రిల్ 24న కానిస్టేబుల్‌ను యువకులు ప్రశ్నించారు. 25న పోలీసులు మంగళగిరి వెళ్లి జాన్ విక్టర్, కరీముల్లాను కొట్టుకుంటూ తీసుకొచ్చారు. తెనాలి పీఎస్‌లో కూడా పడేసి కొట్టారు. ఏప్రిల్ 26న ఐతానగర్‌లో నడిరోడ్డు మీద పడేసి ముగ్గురిని చితకబాదారు. కొట్టొద్దని వేడుకున్నా పోలీసులు వదల్లేదు. యువకుల పరువు ప్రతిష్టలతో ఆడుకుంటూ పడేసికొట్టారు. విక్టర్ జేబులో కత్తి పోలీసులే పెట్టారు. ఈ వ్యవహారంలో తెనాలి టూటౌన్ సీఐ, మరో పీఎస్ సీఐ కూడా ఉన్నారు. ఇద్దరూ వీఆర్వో సమక్షంలో పంచనామా రాసుకున్నారు. అరెస్ట్ చేసిన వాళ్లను సకాలంలో కోర్టు ముందు ప్రవేశపెట్టలేదు. ఇది చట్టాన్ని ఉల్లంఘించడం కాదా? అని వైఎస్ జగన్ ప్రశ్నించారు. ఈ ఘటన జరిగిన తర్వాతే ముగ్గురి మీద రౌడీషీట్ తెరిచారు. పోలీసులు ఎంత దుర్మార్గంగా వ్యవహరించారనేది అర్థమవుతోంది. పోలీసులే తీర్పులు ఇస్తున్నారు. జరుగుతున్నది అన్యాయం అని తెలిసి కూడా.. ఎల్లో మీడియా బ్యాచ్ దారుణంగా కథనాలు ఇచ్చింది. గంజాయి బ్యాచ్, రౌడీ షీటర్లంటూ పరువు తీస్తూ కథనాలు ఇచ్చాయి. కేసులు ఎవరి మీదా అయినా ఉండొచ్చు. ఆ వ్యహారాన్ని కోర్టులు చూసుకుంటాయి. చంద్రబాబుపై 24 కేసులున్నాయని నడిరోడ్డు మీదకు తీసుకొచ్చి తన్నడం ధర్మమేనా?. పోలీసులే చట్టాన్ని ఉల్లంఘిస్తారా?. ఇలా చేసే నైతికత పోలీసులకు ఉందా? ఇది ధర్మమేనా?. పరువు, ప్రతిష్టలు తీసే హక్కు పోసులకు ఉందా?. నడిరోడ్డుపై కొట్టే హక్కు పోలీసులకు ఎవరిచ్చారు? పోయిన ఆ కుటుంబాల పరువును ఎవరు తీసుకొస్తారు? అని జగన్ ప్రశ్నించారు.

### ఆల్ టైమ్ రికార్డ్... హైదరాబాద్‌లో

## రూ.1 లక్ష దాటిన బంగారం ధర

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సరికొత్త రికార్డులను నమోదు చేస్తున్నాయి. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర ఏకంగా రూ.1,00,110 కి చేరింది. ఇది బంగారం ధరల చరిత్రలోనే అత్యధికమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. గతంతో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల అని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 22వ తేదీన 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,00,015 వద్ద గరిష్ఠ స్థాయిని తాకింది. ఇప్పుడు ఆ రికార్డును కూడా అధిగమించి పసిడి ధర కొత్త శిఖరాలకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు పెరగడం, డాలర్‌తో రూపాయి మారకం విలువలో చోటుచేసుకుంటున్న హెచ్చుతగ్గులు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, సరఫరా-డిమాండ్ మధ్య ఉన్న వ్యత్యాసం, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న రాజకీయ అనిశ్చిత పరిస్థితులు వంటి అంశాలు బంగారం ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కారణంగా బంగారం కొనుగోళ్లు పెరిగాయి. అంతేకాకుండా, చాలామంది బంగారాన్ని దీర్ఘకాలిక సురక్షితమైన పెట్టుబడిగా భావించడం కూడా అధిక కొనుగోళ్లకు కారణమైంది.

## కేనడా జీ7 సదస్సుకు భారత్‌కు అందని ఆహ్వానం..

భారత్-కెనడా మధ్య నెలకొన్న ఉద్రిక్త సంబంధాల నేపథ్యంలో ప్రధాని మోదీ ఈ పర్యటనకు సుముఖత చూపకపోవచ్చనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే, గత ఆరేళ్లలో ప్రధాని మోదీ జీ7 సదస్సుకు హాజరుకాని తొలి సందర్భం ఇదే అవుతుంది. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో స్పందించింది. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ మాట్లాడుతూ, జీ7 కూటమి సభ్య దేశాలైన అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీ, జపాన్, ఇటలీ, కెనడా దేశాధినేతలతో పాటు బ్రెజిల్, మెక్సికో, దక్షిణాఫ్రికా, ఉక్రెయిన్, ఆస్ట్రేలియా వంటి దేశాలకు కూడా ఆహ్వానాలు అందాయని తెలిపారు. 2014కు ముందు జీ8గా ఉన్న సమయంలో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు క్రమం తప్పకుండా ఆహ్వానాలు అందేవని, 2014 తర్వాత కూడా ఈ సంప్రదాయం కొనసాగిందని గుర్తుచేశారు. అయితే, ఆరేళ్లలో తొలిసారి భారత ప్రధానికి ఆహ్వానం అందకపోవడం దౌత్యపరంగా ఎదురైన భంగపాటేనని ఆయన విమర్శించారు. భారత్-పాకిస్థాన్ మధ్యవర్తిత్వానికి అమెరికాను అనుమతించడం వంటి పరిణామాల తర్వాత ఇది మరో దౌత్యపరమైన వైఫల్యంగా ఆయన అభివర్ణించారు. జీ7 కూటమిలో భారత్ సభ్యదేశం కానప్పటికీ, ఆతిథ్య దేశాల ప్రత్యేక ఆహ్వానం మేరకు భారత ప్రధానులు గతంలో పలుమార్లు ఈ శిఖరాగ్ర సమావేశాల్లో పాల్గొన్నారు. గత ఏడాది ఇటలీలో జరిగిన జీ7 సదస్సుకు భారత్‌తో పాటు ఆఫ్రికా, దక్షిణ అమెరికాకు చెందిన పలు అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రతినిధులు కూడా హాజరయ్యారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా ఆ సమావేశంలో పాల్గొని తన వాణిని వినిపించారు.


## తుని రైలు దగ్ధం కేసు... ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

అమరావతి: తుని రైలు దగ్ధం కేసుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలకమైన స్పష్టత ఇచ్చింది. ఈ కేసులో రైల్వే కోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీల్‌కు వెళ్లకూడదని ప్రభుత్వం నిశ్చయించింది. కేసును మళ్లీ తిరగదోడే ఉద్దేశం తమకు ఎంతమాత్రం లేదని సర్కార్ తేల్చిచెప్పింది. ఈ కేసులో హైకోర్టులో అప్పీల్ చేయాలంటూ జారీ అయిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వం ఉన్నతాధికారులను ఆదేశించింది. అంతేకాకుండా, ఏ స్థాయిలో, ఎవరి ఆమోదంతో ఈ అప్పీల్ ఫైల్ ముందుకు నడిచిందనే విషయంపై సమగ్రంగా ఆరా తీయాలని కూడా ప్రభుత్వం సూచించినట్లు తెలిసింది. ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం, ఆర్‌పీజీ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ చేసిన ప్రతిపాదనల ఆధారంగానే అప్పీల్ కోసం గతంలో ఉత్తర్వులు వెలువడినట్లు ప్రభుత్వం గుర్తించింది. భవిష్యత్తులో ఇటువంటి చర్యలను ఎంతమాత్రం ఉపేక్షించేది లేదని ప్రభుత్వం నుంచి అధికారులకు స్పష్టమైన హెచ్చరికలు జారీ అయ్యాయి. ఇటువంటి ప్రతిపాదనలు, చర్యల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని, ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా నడుచుకోవాలని ఉన్నతస్థాయి నుంచి ఆదేశాలు వెళ్లినట్లు సమాచారం. అప్పీల్‌కు వెళ్లాలన్న పాత ఉత్తర్వులను రద్దు చేస్తూ అధికారికంగా జీవో త్వరలోనే వెలువడనుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ తాజా నిర్ణయంతో తుని కేసుకు సంబంధించి కొంతకాలంగా నెలకొన్న సందిగ్ధతకు తెరపడినట్లయింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యతను సంతరించుకుంది.

## రాజధాని నుంచి రాయలసీమకు రాచమార్గం

మూడవ పేజి తరువాయి

దీంతో కేంద్రం ప్రత్యామ్నాయంగా అనంతపురం నుంచి గుంటూరు వరకు 398.8 కి.మీ. పొడవున ఉన్న జాతీయ రహదారి-544డిని విస్తరించేందుకు ముందుకొచ్చింది. ఇందులో 288.8 కి.మీ.లను నాలుగు వరుసలుగా విస్తరిస్తుండగా.. మధ్యలో 110 కి.మీ.లను మాత్రం రెండు వరుసలుగానే వదిలేశారు. ఇందుకు కొన్ని సాంకేతిక కారణాలను సాకుగా చూపిస్తున్నారు. దాన్ని కూడా నాలుగు వరుసలుగా విస్తరిస్తే రాజధాని నుంచి రాయలసీమకు రాచమార్గం పడినట్లే..



ఆ భాగం మినహా..


అనంతపురం నుంచి ముచ్చుకోట మీదుగా బుగ్గ వరకు 69 కి.మీ. నాలుగు వరుసలుగా విస్తరిస్తున్నారు. రెండు ప్యాకేజీలుగా రూ.1,600 కోట్లతో ఈ పనులు జరుగుతున్నాయి. బుగ్గ నుంచి కైప మీదుగా గిద్దలూరు వరకు 135 కి.మీ. ప్రస్తుతం రెండు వరుసలుగా ఉండగా, దీన్ని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్) ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ ఇటీవల ఆమోదం తెలిపింది. ఇందులో 15 కి.మీ. రక్షిత అటవీ ప్రాంతం మీదుగా వెళ్తుండగా, దానిని సైతం నాలుగు వరుసలుగా విస్తరించేందుకు క్లియరెన్స్ ఇచ్చింది. దీనికి డీపీఆర్ తయారీతోపాటు, మరోవైపు భూసేకరణ ఆరంభించారు. గిద్దలూరు నుంచి వినుకొండ వరకు 110 కి.మీ.లను పది మీటర్ల వెడల్పుతో రెండు వరుసలుగా విస్తరించే పనులు 2020లో పూర్తయ్యాయి. అప్పటి నుంచి ఎన్‌హెచ్‌ఏఐ టోల్ వసూలు చేస్తోంది. నాలుగు వరుసలుగా విస్తరించే ప్రతిపాదనపై మాత్రం దృష్టిపెట్టడం లేదు. వినుకొండ నుంచి గుంటూరు వరకు ఉన్న 84.8 కి.మీ.లను నాలుగు వరుసలుగా విస్తరించేందుకు మోర్త్ ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ ఆమోదం తెలిపింది. దీనికి రూ.2,605 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేస్తున్నారు. మూడు జిల్లాల్లో భూసేకరణకు సంబంధించి ల్యాండ్ ప్లాన్ సర్వే కూడా చేపట్టారు. డీపీఆర్ సిద్ధమవుతోంది.

రాష్ట్ర ప్రభుత్వం పట్టుబడితే సాకారం

అనంతపురం - గుంటూరు హైవే నాలుగు వరుసలుగా విస్తరిస్తూ, మధ్యలో 110 కి.మీ. రెండు వరుసలుగా వదిలేయడం సరికాదని, దీనిని కూడా నాలుగు వరుసలు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సి ఉంది. అనంతపురం-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే కల సాకారం కాలేదు. ప్రత్యామ్నాయ రహదారిగా భావిస్తున్న అనంతపురం- గుంటూరు హైవే మొత్తం నాలుగు వరుసలతో ఉండాలని కేంద్రానికి తెలియజేయాలి. బుగ్గ-గిద్దలూరు మధ్య అటవీ ప్రాంతంలో సైతం నాలుగు వరుసల హైవేగా విస్తరణకు సమ్మతించిన కేంద్రం.. గట్టిగా పట్టుబడితే గిద్దలూరు-వినుకొండ మధ్య 110 కి.మీ.లను విస్తరించేందుకూ అంగీకరించొచ్చు. ఒకవేళ గిద్దలూరు- వినుకొండ మధ్య తగినంత వాహన రద్దీ లేదని చెబితే.. ఈ ప్యాకేజీకి అటూ, ఇటూ నాలుగు వరుసలుగా విస్తరిస్తున్నందున ఇందులో కూడా ట్రాఫిక్ పెరుగుతుందనే వాదన బలంగా వినిపించొచ్చు.

శ్రీశైలానికి కీలక రహదారి

శ్రీకాకుళం నుంచి గుంటూరు వరకు ఉన్న ఏడు ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలం వెళ్లేందుకు గుంటూరు-అనంతపురం హైవే కీలకం. వీరంతా ఈ హైవేలో గుంటూరు, వినుకొండ, త్రిపురాంతకం మీదుగా కుంట వరకు ప్రయాణించి, అక్కడి నుంచి శ్రీశైలానికి వెళ్తారు. 544డిని పూర్తిస్థాయిలో నాలుగు వరుసలుగా విస్తరిస్తే ఈ హైవే మీదుగా వాహనాల్లో శ్రీశైలం వెళ్లే భక్తుల సంఖ్య కూడా మరింత పెరుగుతుంది.



## డాలస్‌లో మహాత్ముడికి నివాళులర్పించిన కేటీఆర్

హైదరాబాద్: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అమెరికా పర్యటన కొనసాగుతోంది. దీనిలో భాగంగా డాలస్‌లో అమెరికాలోనే అతి పెద్దదైన మహాత్మాగాంధీ విగ్రహాన్ని సందర్శించారు. అక్కడ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ అహింస, సత్యాగ్రహమే ఆయుధాలుగా భారతీయులందరినీ గాంధీ సమాయత్తం చేశారన్నారు. బ్రిటిష్ బానిస సంకెళ్ల నుంచి దేశాన్ని విడిపించి స్వాతంత్ర్యం తీసుకొచ్చేందుకు కృషి చేశారని కొనియాడారు. అందుకే ప్రపంచవ్యాప్తంగా నేటికీ గాంధీని ప్రశంసిస్తూనే ఉంటారని చెప్పారు. అలాంటి విశ్వనాయకుడి విగ్రహాన్ని ఇంత పెద్ద ఎత్తున డాలస్ (ఇర్వింగ్)లో నెలకొల్పడంలో మహాత్మాగాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్ వ్యవస్థాపక అధ్యక్షులు డా.ప్రసాద్ తోటకూర, కార్యవర్గ సభ్యుల కృషిని కేటీఆర్ అభినందించారు. అనంతరం ఆ సంఘం వ్యవస్థాపక కార్యదర్శి రావు కల్వాల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు, దశాబ్దకాలం పాటు రాష్ట్ర అభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, వారి కుటుంబసభ్యులు చేసిన కృషి, త్యాగాలను రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మరువలేరని చెప్పారు. గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం కేసీఆర్ మార్గనిర్దేశంలో కేటీఆర్ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. కేసీఆర్ విజన్ తెలంగాణకు ఒక గళాన్ని ఇచ్చిందన్నారు. డా.ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ అమెరికాలో అతి పెద్దదైన గాంధీ స్మారకస్థలిని నిర్మించి 10 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఈ నిర్మాణం ప్రవాస భారతీయుల సమష్టి కృషి, ఐకమత్యానికి నిదర్శనమని చెప్పారు. దీన్ని సాకారం చేసేందుకు అనుమతులు ఇచ్చిన నగర అధికారులు, దాతలు, కార్యవర్గ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా డాలస్ సందర్శనకు వచ్చినవారు ఈ గాంధీ స్మారకస్థలిని సందర్శిస్తూనే ఉన్నారని చెప్పారు. అనంతరం కేటీఆర్‌ను బోర్డు సభ్యులు రావు కల్వాల, బీఎన్ రావు, తైయాబ్ కుండావాలా, మురళి వెన్నం, రాజేంద్ర వంకావాలా, అనంత్ మల్లవరపు, వినోద్ ఉప్పు, షబ్నం మాడ్గిల్‌తో కలిసి డా.ప్రసాద్ తోటకూర ఘనంగా సన్మానించారు. వందలాది ప్రవాస భారతీయులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కోపెల్ సిటీ కౌన్సిల్ మెంబర్ రమేశ్ ప్రేమ్ కుమార్, ఎన్ఆర్ఐ భారాస అమెరికా విభాగం అధ్యక్షుడు తన్నీరు మహేశ్, ఎన్ఆర్ఐ భారాస గ్లోబల్ కన్వీనర్ బిగాల మహేశ్, నేతలు ఎల్.రమణ, తాతా మధు, గ్యాదరి బాలమల్లు, నవీన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, బాల్క సుమన్, గువ్వల బాలరాజు, గండ్ర వెంకటరమణారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, గాదరి కిశోర్, క్రాంతి కిరణ్, పైలట్ రోహిత్‌రెడ్డి, కోరుకంటి చందర్, నోముల భగత్, బానోతు చంద్రావతి, గండ్ర జ్యోతి, దామోదర్, జాన్సన్ నాయక్, అమరేందర్‌రెడ్డి, రఘువీర్‌సింగ్, యుగంధర్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, అభిలాష్ రంగినేని, సోమ ఉపేందర్‌రెడ్డి, వంశీరెడ్డి, అరవింద్‌రావు తక్కెళ్లపల్లి తదితరులు పాల్గొన్నారు.

## చౌక దుకాణాన్ని తనిఖీ చేసిన తహసిల్దార్ ఆకుల తిరుమల బాబు




సిద్ధవటం, మండల విలేకరి జాకీర్ హుస్సేన్ (శుభోదయం న్యూస్ ) : మండల పరిధిలోని సిద్ధవటం దిగువపేట గాంధీ వీధి చెందిన మంగళవారం తాసిల్దార్ ఆకుల తిరుమల బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. చౌక దుకాణంలోని బియ్యము కోట ఆయన పరిశీలించారు. అనంతరం తాసిల్దార్ తిరుమల బాబు మాట్లాడుతూ 60 సంవత్సరములు 65 సంవత్సరములు వయసుగల వృద్ధులకు ఇంటి వద్దకు వెళ్లి వారి వేలిముద్రలను వేయించుకొని వారి కుటుంబ సభ్యులతో బియ్యం సరఫరా చేయాలన్నారు, 60 65 సంవత్సరముల గల వృద్ధులకు మాత్రం చౌక దుకాణం వద్ద వేచి ఉంచే అవకాశం ఇవ్వవద్దన్నారు, ఉదయం ఎనిమిది గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు చౌక దుకాణంలో బియ్యం సరఫరా చేయాలన్నారు, చౌక దుకాణం వద్ద బోర్డు ఏర్పాటు చేయాలన్నారు ఆయన వంట రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

## పడదెబ్బకు వ్యవసాయ కూలీ మృతి



రెంటచింతల, మండల రిపోర్టర్ -శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): వడదెబ్బకు గురై వ్యవసాయ కూలీ మృతి చెందిన ఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. మండలంలోని తుమ్మకోట గ్రామ శివారు కొత్త గంగరాజుపల్లెకు చెందిన గుడిపల్లి చిన ఎల్లయ్య (61) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తూ పొలం పనులకు వెళుతుంటాడు. మండలంలో గత రెండు రోజులుగా ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ఉష్ణోగ్రతలు 43 డిగ్రీల మేర నమోదవుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం పొలం పనులకు వెళ్లిన ఎల్లయ్య వడదెబ్బకు గురై వాంతులు, విరోచనాలుతో బాధపడుతూ అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతునికి భార్య మరియమ్మ, నలుగురు సంతానం. మండుటెండలకు పేరుగాంచిన రెంటచింతల మండలంలో ఈ ఏడాది వడదెబ్బ గురై మృతి చెందిన ఘటన ఇదే ప్రథమం కావడం గమనార్హం.

### పప్పుల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికుల

### శ్రమను దోచుకుంటున్న యాజమాన్యంపై చర్య తీసుకోండి : బి సురేష్



గుంతకల్లు ప్రతినిధి పల్లె రామాంజనేయులు జూన్ 4 (శుభోదయం న్యూస్) : పప్పుల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికుల శ్రమను యాజమాన్యం దోచుకుంటుందని వారికి న్యాయం చేయాలని ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి బి సురేష్ డిమాండ్ చేశారు సోమవారంఅనంతపురంలోనిగుత్తి రోడ్డు నందు చెన్నప్ప పప్పుల ఫ్యాక్టరీ, ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శిసురేష్ పప్పుల ఫ్యాక్టరీల ఐ ఎఫ్ టి యుఆధ్వర్యంలో సందర్శించి కార్మికులతో మాట్లాడి ఈ కింది విషయాలను పరిశీలించడం జరిగినది.



ఒక్కొక్క ఫ్యాక్టరీలో 100 మంది కార్మికులు పనిచేయుచున్నారు. వీరిలో మిషన్ ఆపరేటర్లు, హమాలీలు, మిషన్ దగ్గర పని చేసే కార్మికులు , మహిళా కార్మికులు, లారీ డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులు తదితరు వారు ఫ్యాక్టరీలో పని చేయుచున్నారు . అయితే వీరి ఎవరికీ లేబర్ చట్టాలైన పిఎఫ్ ఈసీఐ బోనస్ నవమాత్రంగా ఇవ్వడం , వారంలో ఏడు రోజులు పని చేయించుకోవడం, అదనపు పనికి ఓటి ఇవ్వకపోవడం కార్మికులతో అనేక విధాలుగా పని చేయించుకుంటూ వారి శ్రమని యాజమాన్యం దోచుకోవడం జరుగుతున్నది . లేబర్ చట్టాలను యాజమాన్యం అమలు పరచకుండా పెద్ద ఎత్తున ఉల్లంఘిస్తున్న లేబర్ అధికారులు యాజమాన్యం మీద ఎటువంటి చర్యలు తీసుకోకుండా యాజమాన్యానికి వత్తాసు పలుకుతూ వారితో కుమ్మక్క కావడం జరుగుతున్నది . కార్మికులకు జరుగుతున్న అన్యాయం మీద ఇప్పటికైనా లేబర్ అధికారులు స్పందించి కార్మికులకు లేబర్ చట్టాలను అమలుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలి లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని ప్రభుత్వానికి తెలుపుతున్నాము . ఫ్యాక్టరీలను సందర్శించిన వారిలో భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బి సురేష్ , నగర అధ్యక్షులు దావీద్ కార్యదర్శి ఎర్రి స్వామి, నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగుల జీవితానికి బంగారు బాట దూరవిద్య

### శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ గొల్ల లక్ష్మీనారాయణ



గుంతకల్లు ప్రతినిధి పల్లె రామాంజనేయులు జూన్ 4 (శుభోదయం న్యూస్) : నిరుద్యోగులు ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్న వారికి దూరవిద్య ద్వారా డిగ్రీ పీజీ కోర్సులు చేస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని.వాటికి తమ కళాశాలలో రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీల దూరవిద్య కోర్సులు అందుబాటులో ఉన్నాయని దీంతోపాటు దూరవిద్య కోర్సులైన డిఈడి ,బిఈడి ,ఎంఈడి కోర్సులుకూడా తమ కళాశాల అందుబాటులో ఉందని నిరుద్యోగులు ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్న వారు వీటిని సద్వినియోగం చేసుకోవాలని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ గొల్ల లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు సోమవారం తమ కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు ఇప్పటివరకు తమ కళాశాలలో దూరవిద్య ద్వారా విద్యను అభ్యసించి ఎంతోమంది ఉన్నత స్థానాలు చేరుకున్నారని ఆయన పేర్కొన్నారు తమ కళాశాలలో బిఏ, బీకాం, బీఎస్సీ తో పాటు పీజీ కోర్సులైన ఎంఏ, ఎం కామ్,ఎంఎస్సీ ఎంబీఏ ,ఎంసీఏ ,ఎం ఎస్ డబ్ల్యూ, ఎం ఎల్ ఐ సి .సివంటి కోర్సులు కూడా ఉన్నాయన్నారు దీంతోపాటు మెడికల్ కోర్సులు డి ఫార్మసీ ,బి ఫార్మసీ ,కోర్సులు కూడా ఉన్నాయి అన్నారు దీంతోపాటు పదో తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ యూనివర్సిటీ కూడా తమ కళాశాల అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు గుత్తి రోడ్ లోని ఎఫ్సిఐ గోడౌన్ ఎదురుగా ఉన్న తమ కళాశాలను సంప్రదించాలని మిగతా వివరాలకు తన సెల్ నెంబర్ 97 012 633 19, 79890 99 930, 911035 7835 సెల్ ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

## లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ ఓ మహిళకు రక్తదానం చేసిన వైనం



గుంతకల్లు ప్రతినిధి పల్లె రామాంజనేయులు జూన్ 4 (శుభోదయం న్యూస్): లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ మంగళవారం సరస్వతి అనే మహిళకు రక్తదానం చేశారు ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు రంజాన్ వివరాలు ప్రకారం పటంలోని సాయి కృష్ణ నర్సింగ్ హోమ్ లో సరస్వతి అనే మహిళకు ఓ పాజిటివ్ రక్తం అవసరం కాగా వారి బంధువులు లెజెండ్ బ్లడ్ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు రంజాన్ ను సంప్రదించారు దీంతో ఆయన ఆటో అమాలి మహమ్మద్ నువ్వు సంప్రదించి వెంటనే గోపి బ్లడ్ బ్యాంకుకు పిలిపించి రక్తదానం చేశాడు మహమ్మద్ 17వ సార్లు రక్తదానం చేయడం విశేషం ఈ సందర్భంగా ఆటో అమాలి మొహమ్మద్ కు రంజాన్ కృతజ్ఞతలు తెలిపారు.

## వైస్సార్ నగర్ నందు కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్.



నంద్యాల రిపోర్టర్/మోహన్ (శుభోదయం న్యూస్ ): జిల్లా ఎస్పీ శ్రీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు నంద్యాల సబ్ డివిజన్ ఏ.ఎస్.పి జావళి ఆల్ఫోన్స్ సూచనలతో నేటి తెల్లవారుజామున జిల్లా పట్టణ కేంద్రంలోని వైస్సార్ నగర్ నందు నంద్యాల తాలూకా ఇన్స్పెక్టర్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు, క్యూఆర్టి సిబ్బంది బృందాలుగా ఏర్పడి కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా తాలూకా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు వైస్సార్ నగర్ నందు కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగిందని ఇందులో అనుమానితులు మరియు నేరచరిత్ర గలవారు, రౌడీ షీటర్ల ఇళ్లని తనిఖీచేసి సరైన ధ్రువపత్రాలు లేని 05 బైక్ లు స్వాధీనం చేసుకోవడం జరిగింది.అనంతరం ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి సరైన పత్రాలు లేని వాహనాలను కొనడం, తాకట్టు పెట్టుకోడం, దొంగలించడం లాంటి పనులు చేయరాదని,గంజాయి రవాణా ,విక్రయం లాంటి నేరాలు చేస్తే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. మరియు ప్రస్తుతం సమాజంలో జరిగే నేరాలపై అప్రమత్తంగా ఉండాలని రోడ్డు ప్రమాదాలు, మహిళలపై జరిగే నేరాలు, సైబర్ క్రైమ్ నేరాలు మొదలగు వాటిపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలియజేశారు.రాత్రి వేళలో అనవసరంగా బయట తిరిగితే బౌండ్ ఓవర్ కేసులు పెడతామని రౌడీషీటర్ల మీద మరియు సస్పెక్ట్ షీటర్ల కదలికల మీద గట్టి నిఘా ఉంచడంతోపాటు చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు ఈశ్వరయ్య, వంశీధర్ ,చాంద్ బాషా మరియు సబ్-ఇన్స్పెక్టర్లు ధనమ్మ , నజీర్ లు పాల్గొన్నారు.

## కృషి విజ్ఞాన కేంద్రం యాగంటిపల్లె వారి

## ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమము



నంద్యాల రిపోర్టర్ / మోహన్ (శుభోదయం న్యూస్ ): మండలంలోని అయ్యలూరు మరియు పెద్ద కొట్టాల గ్రామాలలో కృషి విజ్ఞాన కేంద్రం యాగంటిపల్లె వారి ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమము నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ వై.వి. మురళీకృష్ణ, కేవీకే కోఆర్డినేటర్ శ్రీమతి ధనలక్ష్మి , శాస్త్రవేత్తలు సుధాకర్ , సుగన్న , హాఫీజ్ పర్వీన్ , సహాయ వ్యవసాయ సంచాలకులు రాజశేఖర్, జిల్లా ఉద్యాన అధికారి నాగరాజు, మండల వ్యవసాయ అధికారి ప్రసాద రావు ,ఉద్యాన అధికారి శ్రీధర్, బి టి యం ఉమా మహేశ్వరి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ వై.వి. మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ సంవత్సరం సమయానికి వర్షాలు కురుస్తున్నందున రైతులు వరి సాగుకు ముందు పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ లేదా పిల్లి పెసర లేదా మినుము సాగు చేయాలని, అలాగే వరిగట్లపై కంది లేదా కూరగాయలు సాగు చేయుట వలన రైతులు అదనపు ఆదాయం పొందగలరని, ఎరువులు పురుగుమందుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలని సూచించారు. కేవీకే కోఆర్డినేటర్ శ్రీమతి ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని దానికి అనుగుణంగా ఎరువులు వాడడం వలన సాగు ఖర్చులు తగ్గించగలరని అలాగే పురుగుమందులు విచక్షణారహితంగా వాడకుండా సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. శాస్త్రవేత్త సుధాకర్ మాట్లాడుతూ రైతులు సాలు వరి సాగు చేయటం వలన సేద్యం ఖర్చులు తగ్గించగలరని తెలిపారు.జిల్లా ఉద్యాన అధికారి నాగరాజు మాట్లాడుతూ రైతులు అధిక ఆదాయాన్నిచ్చే పండ్లతోటలు, కూరగాయలు సాగు చేయాలని ఇందుకుగాను ఉద్యాన శాఖ ద్వారా రాయితీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ముక్తార్ భాష ,మణి మోహన్ రెడ్డి ,షర్మిల, గ్రామ వ్యవసాయ సహాయకులు మాధురి, అయ్యలూరు సర్పంచ్ ఓబులేసు మరియు రైతులు పాల్గొన్నారు.

## ధర్మవరం పట్టణంలో భారతీయ జనతా పార్టీలోకి భారీ చేరిక



ఉమ్మడి అనంతపురం జిల్లా బ్యూరో "నరేంద్ర "(శుభోదయం న్యూస్): ధర్మవరం పట్టణంలోని 17వ వార్డు చెందిన చెన్నారెడ్డి వారి మిత్రబృందం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ధర్మవరం బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు వీరికి పార్టీ కండువాలు కప్పి, వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ %-% 2024 జూన్ 4వ తేదీ ఆంధ్రప్రదేశ్ ప్రజల చరిత్రలో మరిచిపోలేని రోజు. ఇది రాష్ట్ర ప్రజలు జగన్ మోహన్ రెడ్డి శాసనాన్ని తిరస్కరించిన, ప్రజా ఆగ్రహం తాళాలను తెంపిన, ఒక నిజాయితీగల నాయకుడైన సత్యకుమార్ యాదవ్ కి విజయాన్ని అందించిన ప్రత్యేకమైన రోజు, అని పేర్కొన్నారు. జగన్ పాలనపై ఘాటు విమర్శలు 2019 నుండి 2024 వరకూ రాష్ట్రాన్ని శాడిస్టుగా పాలించిన జగన్ రెడ్డి పాలన ఒక వినాశకర అధ్యాయం. మత, కుల, వర్గాలు అన్నీ మరిచి ప్రతి ఒక్కరిని మోసగించిన వైసీపీ పాలనకు ప్రజలు చరమగీతం పాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, యువత, మహిళలు %-% ఎవ్వరూ మినహాలేదు, అని ఆయన విమర్శించారు. బీజేపీ గెలుపు %-% అభివృద్ధికి నాంది ధర్మవరం ప్రజలు అత్యంత విశ్వాసంతో ఓటేసి, సత్యకుమార్ యాదవ్ ని శాసనసభకు పంపడమే కాదు, ఆయనకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు అప్పగించబడేలా చేశారు. వైద్య శాఖ అనేది 24 గంటల సేవ అవసరమయ్యే శాఖ అని, అలాంటి శాఖను అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తూ, అదే సమయంలో ధర్మవరం అభివృద్ధికి కృషి చేస్తున్న ఘనత ఆయనదని హరీష్ బాబు చెప్పారు.ధర్మవరం అభివృద్ధికి మంత్రి సత్య కుమార్ యాదవ్ రూ. 35 కోట్లతో ధర్మవరం హ్యాండ్లూమ్ క్లస్టర్,10 పడకల డయాలసిస్ సెంటర్ స్థాపన,రూ. 23 లక్షలతో ఏరియా ఆసుపత్రి రోడ్ల నిర్మాణం,100 పడకల ఆసుపత్రిని 150 పడకలకు విస్తరణ,రామ్ నగర్, మాత్మ గాంధీ నగర్‌లో హెర్బల్ పార్కులు (కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ మద్దతుతో ఏర్పాటు చేయనున్నారు. అలాగే హరీష్ బాబు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి2019%-%24 మధ్య ఏ అభివృద్ధి పనీ చేయలేదు. ఒక్క ఇటుక వేసిన ఘనత కూడా లేదు. ధర్మవరం ప్రజలు గతంలో చేసిన పొరపాటుని సరిదిద్దుకొని ఈసారి అభివృద్ధికి ఓటు వేశారు, అని హరీష్ బాబు విమర్శించారు. సత్యకుమార్ వ్యక్తిత్వంపై ప్రశంసలు సత్యం అంటే సత్యకుమార్. ఆయనే నిజాయితీకి, నీతికి, నిస్వార్థ సేవకు మారుపేరు. ఆయన కాలిబర్‌కు సమానమైన నాయకత్వం రాష్ట్రంలో మరెవరికీ లేదు. ఆయన భూకబ్జా, వడ్డీ, పేకాట, వ్యభిచార గుహలకు వ్యతిరేకంగా నిలబడ్డ ఏకైక నాయకుడు, అని పేర్కొన్నారు. అలాగే హరీష్ బాబు జూన్ 4న ధర్మవరం ఎన్డీఏ కార్యాలయం వద్ద విజయోత్సవ సభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ప్రజలందరూ తమ ఇళ్ల వద్ద దీపాలు వెలిగించి, ముగ్గులు వేసి, పండుగలా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చంద్ర, రూరల్ అధ్యక్షులు గొట్లూరు చంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబులేష్, జాతీయ కౌన్సిల్ సభ్యులు అంబటి సతీష్, ఎస్టి మోర్చా స్టేట్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ నాయక్, మైనార్టీ నాయకులు నబి రసూల్, బిజెపి నాయకులు డోలా రాజారెడ్డి, బిల్లే శ్రీనివాసులు, పోతుకుంట రాజు, కుంచపు నారప్ప, ఏలుకుంట్ల లక్ష్మీనారాయణ, పోతునాగేపల్లి లక్ష్మీనారాయణ, చిగిచెర్ల ఆదినారాయణ, మహిళా నాయకురాలు రాధమ్మ, మహాలక్ష్మి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరం ప్రజలే గమ్యం ప్రతి అడుగూ ధర్మవరం అభివృద్ధి వైపు



ఉమ్మడి అనంతపురం జిల్లా బ్యూరో "నరేంద్ర "(శుభోదయం న్యూస్): ధర్మవరం శాసనసభ నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో విజయం సాధించి, రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించి గడిచిన ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా, మంత్రి సత్యకుమార్ యాదవ్ గారు ధర్మవరం పట్టణ ప్రజల మధ్యకు మరోసారి నడక మార్గంలో వస్తున్నారు.ఈ నెల 4వ తేదీన ప్రారంభం కావలసిన పాదయాత్ర, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో జూన్ 21న విశాఖపట్నంలో నిర్వహించనున్న రాష్ట్ర ప్రభుత్వం అధికారిక కార్యక్రమం %-% అంతర్జాతీయ యోగా దినోత్సవంలో మంత్రి పాల్గొననున్న నేపథ్యంలో, పాదయాత్రను జూన్ 21వ తేదీ పైన వాయిదా వేశారు. యోగా కార్యక్రమం ముగిసిన వెంటనే పాదయాత్ర ప్రారంభమవుతుంది. ఈ పాదయాత్రలో భాగంగా మంత్రి ధర్మవరం పట్టణంలోని ప్రతి వీధిని సందర్శిస్తూ, ప్రజల అభిప్రాయాలను నేరుగా తెలుసుకోనున్నారు. గత ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రజాపాలనపై ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ స్వీకరించి, రాబోయే రోజుల్లో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలకు దారి తీసేలా చర్చలు జరగనున్నాయని మంత్రి కార్యాలయం వెల్లడించింది. ఈ పాదయాత్ర ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమయ్యే వేదికగా మారనుంది. ప్రజల సమస్యలు వినడం, పరిష్కార మార్గాలను సమీక్షించడం, అభివృద్ధి అజెండాను ముందుకు తీసుకెళ్లడం వంటి ముఖ్య ఉద్దేశ్యాలతో ఈ పాదయాత్ర నిర్వహించనున్నారు.


## వెన్నుపోటు దినం కార్యక్రమానికి భారీగా తరలిరండి...



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): పత్తికొండ పట్టణంలో బుధవారం జరిగే విన్నపోటు వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు విజయవంతం చేయాలని వైసిపి నాయకులు బొందిమడుగుల ఈశ్వర్ రెడ్డి కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి ప్రజలకు వెన్నుపోటు పొడవడంతో వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం పత్తికొండ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే శ్రీ దేవమ్మ ఆధ్వర్యంలో జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమానికి నియోజవర్గంలోని వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, భారీగా తరలివచ్చి చంద్రబాబు నాయుడుకు కనువిప్పు కలిగే విధంగా ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైయస్సార్సీపీ నాయకులు బొందిమడుగుల ఈశ్వర్ రెడ్డి కోరారు.

## విజయవాడ లో గిరిజన సలహా మండలి

## సభ్యులు పి.వెంకటపతి కు ఘనంగా సన్మానం...



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): మండల పరిధిలోనే కొత్తపల్లి గుడిసెలకు చెందిన టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. వెంకటపతి ను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులుగా నియమించడంతో మంగళవారం విజయవాడ నగరంలో జరిగిన తెలుగుదేశం పార్టీ గిరిజన ఆత్మీయ సదస్సులో పి.వెంకటపతి ను ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు డాక్టర్ శ్రీ కొండారెడ్డి నరహరి వరప్రసాద్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ గిరిజన ఆత్మీయ సదస్సు జరిగింది. ఈ సదస్సులో రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు పి.వెంకటపతి మాట్లాడుతూ రాష్ట్రంలోనే గిరిజనల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ మాత్రమే కృషి చేసిందన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నో సంవత్సరాల నుండి గిరిజనులకు అందుతున్న సంక్షేమ పథకాలు అన్నిటిని రద్దుచేసి గిరిజనులకు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. అయితే వెన్నుపోటు పొడిచే అలవాటు ఉన్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై వెన్నుపోటు అంటూ ఆందోళన కార్యక్రమాలకి పిలుపునివ్వడంతో రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారని ఆయన ఎద్దేవా చేశారు. అంతేకాక రాష్ట్రంలో రెండవ గిరిజన మండలంగా ప్రభుత్వం చేత గుర్తింపు పొందిన తుగ్గలి మండలంలో ని అన్ని తండాలకు తారు రోడ్లు వేయించిన ఘనత కేఈ కుటుంబానికి దక్కిందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కేఈశ్యాం కుమార్ పత్తికొండ నియోజకవర్గం అభివృద్ధి కోసం కృషి చేస్తూ, ఆ ప్రాంత ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ నియోజకవర్గ ప్రజల నుండి మన్నలు పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోనే వివిధ ప్రాంతాల నుండి వచ్చిన గిరిజన నాయకులు పాల్గొన్నారు.

## : గోవుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వెయ్యండి.



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):ఈనెల 7 తారీఖు బక్రీద్ పండుగ సందర్భంగా గోవులను వధించడం జరుగుతుంది. కావున గోవుల అక్రమ రవాణాన్ని అడ్డుకోవాలని చెప్పి ఈరోజు స్థానిక బీర్కూర్ పోలీస్ స్టేషన్లో ఎస్ఐ రాజశేఖర్ గారికి వినపత్రం మండల బీజేపీ నాయకు అలాగే ఈ ప్రాంతం మహారాష్ట్ర బార్డర్ కాబట్టి అక్రమ గోవులను రవాణా చేసే అవకాశం ఎక్కువ ఉంటుంది కాబట్టి ఇరువైపులా చెక్ పోస్టు ఏర్పాటు చేసి గోవుల అక్రమ రవాణా జరగకుండా చూడాలని స్థానిక రాజశేఖర్ రెడ్డి నీ కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు నాగేళ్ల సాయికిరణ్, మండల ఉపాధ్యక్షుడు హనుమాన్లు యువమోర్చా అధ్యక్షుడు వినేష్ సీనియర్ నాయకులు రవి, బీరుగొండ వడ్ల బసవరాజ్, సాయిబాబా కార్యకర్తలు నవీన్, శ్రావణ్ పాల్గొన్నారు

### ఇందిరమ్మ ఇండ్ల మార్కింగ్ పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి.



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): తెలంగాణ రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇల్లు లేని ప్రతి ఒక్క అర్హులకు ఇల్లు అందచడమే ప్రభుత్వ లక్ష్యం అని సబ్ కలెక్టర్ కిరణ్మయి స్పష్టం చేశారు. బీర్కూర్ మండల కేంద్రం లోని కిష్టాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు మార్కింగ్ చేసి భూమి పూజ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

## పత్రాల పంపిణీలో ఎమ్మెల్యే పోచారం, కాసుల



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):వర్ని మండల కేంద్రం సిసిడి ఫంక్షన్ హాల్ లో వర్ని, చందూర్, మోస్రా, రుద్రూర్ మండలాల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజక వర్గ శాసన సభ్యులు శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ శ్రీ కాసుల బాలరాజు.వర్ని మండలంకు 425 మంది, చందూర్ మండలం కు 94 మంది, మోస్రా మండలంకు 96 మంది, రుద్రూర్ మండలంకు 188 మందికి మొత్తం 803 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేసి,ఇళ్ల నిర్మాణం పైన అవగాహన కల్పించిన పోచారం శ్రీనివాసరెడ్డి.ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేదలందరికీ ఇల్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా




ఉందని,అర్హులైన వారు ముందుకు వస్తే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నానని తెలియజేశారు.పాల్గొన్న ఉమ్మడి వర్ని మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ సురేష్ బాబా, ప్రజాప్రతినిధులు, నాయకులు,అధికారులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

శుభోదయం
బుధవారం -04-జూన్-2025

## రేషన్ దుకాణాల వద్ద రేషన్ పంపిణీ

### ఈ నెల ఒకటి నుంచి పంపిణీకి శ్రీకారం చుట్టాము : తాసిల్దార్ రమాదేవి



గుంతకల్లు ప్రతినిధి పల్లె రామాంజనేయులు జూన్ 4 (శుభోదయం న్యూస్) : గుంతకల్ మండల పరిధిలోని అన్ని రేషన్ దుకాణాల వద్ద ఈనెల ఫోటో తేదీ నుంచి రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు రేషన్ దుకాణాల వద్ద రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని దిగ్విజయంగా ప్రభుత్వం చేపట్టిందని తాసిల్దార్ రమాదేవి పేర్కొన్నారు మంగళవారం సాయంత్రం తాసిల్దార్ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తూకార్డుదారులకు ఎం డి యు వాహనాల ద్వారా కాకుండా రేషన్ దుకాణాల ద్వారానే జూన్ ఒకటో తారీకు నుంచి నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మరియు సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు సరుకులను రేషన్ కార్డ్ దారులకు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా 65 సంవత్సరాలు పైబడిన వారికి వికలాంగులకు మరియు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రతి నెల 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు మధ్యాహ్నం 12.00 గంటల నుంచి 4.00గంటల మధ్యలో వారి ఇంటి వద్దనే వేలిముద్రను సేకరించి వారి ఇంటికే ప్రభుత్వం వారి ద్వారా మంజూరు కాబడిన నిత్యవసర వస్తువులను ఇవ్వడం జరుగుతుందని గుంతకల్ మండలం పరిధిలో 3222 మంది కార్డ్ దారులకు ఇంటి వద్ద సరుకులు తీసుకునే వేసులుబాటును ప్రభుత్వం వారు కల్పించారని అదేవిధంగా రేషన్ షాపుల వద్ద కార్డుదారులు గుమి కూడకుండా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సచివాలయ సిబ్బంది ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని ఈ మేరకు నియామకాలు కూడా జరుపబడునని తెలిపి ఉన్నారు ఐ వి ఆర్ ఎస్ కాల్స్ ద్వారా కూడా ప్రభుత్వం వారు రేషన్ కార్డు దారులకు ఏ విధంగా పంపిణీ కార్యక్రమం జరుగుతున్నది మరియు ఇతర వివరములపై ప్రజల నుంచి వారి స్పందన తీసుకోవడం జరుగుతుందని పై విషయాలను ప్రజలకు విస్తృతనగా ప్రచారం చేయడంలో భాగంగా మండలం పరిధిలో దండోరా మరియు మైక్ అనౌన్స్మెంట్ కూడా ఇవ్వడం జరుగుతుందని సమావేశంలో తెలిపి ఉన్నారు .డిటి నారాయణస్వామి రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## 13వ పునీత అంతోని పండుగ మహోత్సవములు




గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ – సురేష్ (శుభోదయం న్యూస్) :జూన్ 3 కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో ఈ రోజు సాయంత్ర పండుగ కరపత్రాని కేసరపల్లి విచారణ కర్తలు రెవ.ఫాదర్ నూతలపాటి కిషోర్ విడుదల చేశారు. ఈ నెల 04 తేది నుండి 12 వ తేది వరకు నవదిన ప్రార్థనలు సమర్పించబడును మొదటి రోజు నవదిన ప్రార్థనలు విజయవాడ, మేత్రాసన సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ రెవ.ఫాదర్ తోట సునీల్ చే ప్రారంభించబడును. 10,11తేదీలలో సువార్త స్వస్థత ప్రార్థనలు విజయవాడ మేత్రాసన పాస్టరల్ సెంటర్ డైరెక్టర్ రెవ.ఫాదర్ బావను విజయరాజు, చేతుల స్వస్థత ప్రార్థనలు, దివ్యబలిపూజ సమర్పించబడును. చివరి రోజు అనగా 13 తేది విజయవాడ మేత్రాసన పీఠాధిపతులు, తెలగతోటి జోసఫ్ రాజారావు చే పలువురు గురువుల చే దివ్యబలిపూజ, సమర్పించబడును. మధ్యాహ్న కేసరపల్లి గ్రామ ప్రజలకు ప్రేమవిందు కలదు సాయంత్ర 4:గంటలకు పునీత అంతోని వారి స్వరూపముతో తేరు ప్రదక్షిణ కలదని విచారణ కర్తలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంఘ పెద్దలు యువతి యువకులు తదితరులు పాల్గొన్నారు.

## త్రిపురాంతకం మండలం ఉపాధి హామీ పనిలో అంతులేని అవినీతి

**పనులు చేయకుండానే బోగస్ మస్టర్లతో లక్షలు స్వాహా చేసేందుకు సిద్ధం**

**కూలీల నుంచి వారానికి 300 వసూలు చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు కీలక పాత్ర పోషిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు**



ఎర్రగొండపాలెం, నియోజకవర్గ ఇంచార్జి – కాకర్ల కోటయ్య (శుభోదయం న్యూస్): పేదలకు ఉపాధి పనులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఉపాధి హామీ పథకం త్రిపురాంతకం మండలంలో అధికారుల అక్రమాలకు ఉపాధి వరంగా మారింది. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు మండల అధికారులు కలిసి ఉపాధి పేరుతో కోట్ల రూపాయల అవినీతికి పాల్పడుతున్నారు. మండలంలోని అన్ని గ్రామా ల్లో ఇదే తంతు కొనసాగింది. గత నాలుగు వారాల నుండి జరిగిన ఉపాధి హామీ పథకం పనులు కూలీలు పనులు చేయకుండానే ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీల నుంచి వారానికి 300 రూపాయలు వసూలు చేసి ఒక్కొక్కరికి వెయ్యి నుండి 1500 రూపాయలు చెల్లిస్తామని ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలకు హామీ ఇస్తున్నారు. అయితే గ్రామాల్లో చెరువుల్లో అరకొరగా చేసిన పనులకు టెక్నికల్ అసిస్టెంట్లు చేసిన పనులకు కొలతలు పది రెట్లు ఎక్కువ చూపించి కోట్ల రూపాయలు ప్రభుత్వ ధనాన్ని వృధా చేస్తున్నారు.పనులు చేసిన కూలీలు వారానికి 300 రూపా యలు ఇవ్వకపోతే తక్కువ వేస్తూ డబ్బులు ఇచ్చిన వారికి 1400 నుంచి పదిహేను వందల రూపాయలు చెల్లించినట్లు ఆరోపిస్తున్నారు. పర్య వేక్షించాల్సిన అధికారులు మామూలు తీసుకుంటూ తమకు సంబంధం లేదని చేతులుదులుపుకుంటున్నారు. గ్రామాల్లో అర కొరగా పనులు చేసి కొలతలు తీసి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ కలిసి ఎక్కువ బిల్లులు చెల్లించి కూలీల నుంచి అక్రమ వసూలు పాల్పడుతున్నారు. గ్రామాల్లో లేనివారికి వాళ్ల దగ్గర వారానికి 300 రూపాయలు వసూలు చేసి వాళ్లకు కూడా పనికి వెళ్ళినట్లు చూపిస్తున్నారు. సంబంధిత అధికారులు వాటాలు తీసుకుంటూ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి త్రిపురాంతకం మండలంలో అవినీతి చేయించే అధికారులపై నిఘా పెట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## బండలాగుడు పోటీల కరపత్రాలను ఆవిష్కరించిన.. కదిరి బ్రదర్స్




పామూరు, మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): సిఎస్ పురం గ్రామంలో రాచూరి పెద్దమ్మతల్లి తిరునాళ్ళ మహోత్సవము సందర్భంగా కాపు నాయుడ్లు ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన నిర్వహిస్తున్న బండలాగుడు పోటీల కరపత్రాలను మంగళవారం కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు గారి సోదరులు కదిరి ప్రకాశ్ రావు, పార్థసారథి లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ పురం ఎంపిటిసి మన్నెపల్లి పెద్దన్న,మన్నెపల్లి రవికుమార్, మాజీ ఎంపిటిసి మూరం కాశిరెడ్డి,మునగల నారాయణ రెడ్డి, ఇరగని చలపతి రావు,పట్నం తిరుపతయ్య, నిమ్మల శ్రీనివాసులు, ఖాసీం భాష,మాధవ రావు,మహేశ్వర రావు,తదితరులు పాల్గొన్నారు.

## నేడు జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

### వైఎస్ఆర్సిపి మండల నాయకులు గంగసాని హుస్సేన్ రెడ్డి



పామూరు, మండల రిపోర్టర్ – బండి రమేష్ (శుభోదయం న్యూస్): నేడు కనిగిరి పట్టణంలో జరిగే

వెన్నుపోటు దినంగా పరిగణిస్తూ మండలంలో అన్ని గ్రామాల నుండి భారీ నిరసన కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి పిలుపునిచ్చారు.వాలంటీర్స్ సోదర సోదరీ మణులందరికీ విజ్ఞప్తి, కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత ,వెన్నుపోటు ముఖ్యమంత్రి ,వెన్నుపోటు బాబు ,ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరువాత మొట్టమొదటగా వాలంటీర్స్ ని వెన్నుపోటు పొడిచారు. ఎన్నికల సమయంలో వాలంటీర్స్ అందరిని నమ్మించి రాష్ట్రంలో ఉన్న రెండు లక్షల అరవై వేల మంది వాలంటీర్స్ ను వెన్నుపోటు పొడిచారు ,అంతేకాదు రేషన్ వాహనాలు %వీణఖ% లకు వెన్నుపోటు పొడిచారు, అంతేకాదు సూపర్ సిక్స్ అని చెప్పి రాష్ట్ర ప్రజలందరికీ వెన్నుపోటు పొడిచారు, వెన్నుపోట్లు బాబు గారికి ఇవన్నీ కొత్తవి కాదు, కావున ఈ యొక్క రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు ప్రజలకు చేస్తున్న అన్యాయాలు ప్రజలకు వివరించి వెన్నుపోటు బాబును గద్దె దింపి గుణపాఠం చెప్పడానికి అందరూ ముందుకు వస్తారని, అలాగే నేడు జరిగే వెన్నుపోటు దినంకు మండలంలో అన్ని గ్రామాల నుండి తరలివచ్చి విజయవంతం చేస్తారని వాలంటీర్స్అందరికీ పేరు పేరునా నా విజ్ఞప్తి చేస్తున్నాను అని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

## గుర్రం మల్లేశ్వరమ్మ మృతి పట్ల సంతాపం తెలిపిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, ఇరిగినేని, దారపనేని, బైరెడ్డి, గుర్రం



పామూరు, మండల రిపోర్టర్ – బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం సట్టుమడుగు గ్రామ సీనియర్ రాజకీయ నాయకులు దివంగత ఇరిగినేని తిరుపతి నాయుడు ముఖ్య అనుచరులు కీర్తిశేషులు గుర్రం శేషయ్య సతీమణి గుర్రం మల్లేశ్వరమ్మ మంగళవారం మృతి చెందారు. మల్లేశ్వరమ్మ మృతి పట్ల కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఇరిగినేని రవీంద్రబాబు, కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి, పామూరు మండల టిడిపి నాయకులు గుర్రం వెంకటేశ్వర్లు వారి కుమారులు గుర్రం రామసుబ్బారావు, నరేంద్ర, కుమార్తె రమణమ్మ, కీర్తిశేషులు గుర్రం శేషయ్య సోదరుని కుమారులు గుర్రం నాగేశ్వరరావు, గుర్రం రమేష్ లకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మల్లేశ్వరమ్మ మృతి పట్ల చిలంకూరు మాజీ సర్పంచ్ యరశింగు ముసలయ్య, రాజకీయ సీనియర్ నాయకులు పచ్చావా పేరయ్య, దేవరపు డాల్ మాల్యాద్రి, వగ్గంపల్లి టిడిపి నాయకులు చావా సుబ్బారావు, యరశింగు వెంకటేశ్వర్లు, అల్లు శ్రీనివాసులు, నూతంగి నారాయణ అండ్ బ్రదర్స్, దేవరపు మాల్యాద్రి అండ్ బ్రదర్స్, పచ్చావా వెంకటేశ్వర్లు అండ్ బ్రదర్స్, డాక్టర్ కోటపాటి శ్రీ చరణ్, బబ్లు బ్రదర్స్ పామూరు మండల టిడిపి శ్రేణులు, సానుభూతిపరులు మల్లేశ్వరమ్మకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ప్రమాదంలో కాలిపోయిన నిరుపేద కుటుంబం నివసిస్తున్న పూరి గుడిసె - అండగా నిలిచిన టీడీపీ నాయకులు



ఎర్రగొండపాలెం, మండల రిపోర్టర్ – నారాయణ (శుభోదయం న్యూస్): యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఆదేశాల మేరకు యర్రగొండపాలెం పట్టణంలోని గాయత్రి హాల్ నందు ఓ నిరుపేద కుటుంబం నివసిస్తున్న వారి పూరి గుడిసె ప్రమాదవశాత్తు కాలిపోయిన



ఘటన తెలుసుకున్న మండల టీడీపీ నాయకులు వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి నూతన గృహ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తక్షణ సాయంగా వారికి నిత్యావసర సరుకులు, కూరగాయలతో పాటు ఆర్థిక సాయం అందించారు..

## శ్రీ భుజంగేశ్వర స్వామి దేవాలయ భూమి దేవస్థానానికి తిరిగి స్వాధీనం



**పామూరు, మండల రిపోర్టర్ – బండి రమేష్ శుభోదయం న్యూస్): పామూరులోని శ్రీ భుజంగేశ్వర స్వామి దేవాలయానికి చెందిన సర్వే నంబర్ 256/2 లో ఉన్న 29.33 ఎకరాల భూమిలో కొంత భాగాన్ని కొందరు వ్యక్తులు వెంచర్ ఏర్పాటు చేసి, సర్వే నంబర్ 255/1గా చూపించి కొనుగోలు దారులకు రిజిస్టర్ చేశారు. అయితే భౌగోళికంగా ఆ భూమి నిజానికి దేవాలయానికి చెందిందని గుర్తించబడి ఆ భూమిని కొనుగోలు చేసిన పాబోలు శివ సుమారు రూ. 20 లక్షలు విలువగల భూమిని సోమవారం ఎమ్మెల్యే ఉగ్ర సమక్షంలో సంపూర్ణంగా దేవస్థానానికి తిరిగి అప్పగించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "దేవుని భూముల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పాబోలు శివ చర్య అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.మంగళం వారు పాబోలు శివ లిఖిత పూర్వకంగా ఈవో కి దేవాలయ కార్యాలయంలో అందజేశారు. ఈవో శ్రీ గిరిరాజు నరసింహబాబు మాట్లాడుతూ, "ఇది భూకబ్జా వంటి అక్రమాలకు ఎదురు చెప్పే విధంగా నిలిచిన ఒక స్ఫూర్తిదాయక ఘటన అని దేవస్థాన భూముల పట్ల బాధ్యతతో వ్యవహరించిన పాబోలు శివ కు దేవాలయ పాలక మండలి తరపున అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొండిశెట్టి రమణయ్య, మాజీ ఆలయ చైర్మన్ గుర్రం వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.**


## పువ్వాడి వారి వివాహ వార్షికోత్సవ వేడుకలో పాల్గొన్న టిడిపి నాయకులు హాజీ గౌస్



పామూరు, మండల రిపోర్టర్ – బండి రమేష్ (శుభోదయం న్యూస్): పామూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు దంపతుల వివాహ వార్షికోత్సవం కార్యక్రమం పువ్వాడి అపార్ట్మెంట్లో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో పామూరు పట్టణ టిడిపి నాయకులు షేక్ హాజీ గౌస్ పాల్గొని వాళ్లకి శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహుకరించడం జరిగింది ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జనసేన నాయకులు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రి దుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆకుపాటి





పామూరు, మండల రిపోర్టర్ – బండి రమేష్ (శుభోదయం న్యూస్): విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గమ్మ అమ్మవారి సేవలో ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్%శా%.శేష వస్త్రం వేద అశ్వర్వచనం తీర్థ ప్రసాదాలు అందజేసిన ఆలయ సిబ్బంది. ఈ కార్యక్రమం లో గద్దె సుధాకర్, బండ్ల నారాయణ, గాడి మహేంద్ర, ఇండ్ల నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

## : మాజీ మంత్రి హరీష్ రావు సూచన మేరకు కలెక్టర్ వల్లూరు క్రాంతిని కలిసిన రైతులు



గుమ్మడిదల, (శుభోదయం న్యూస్): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలానికి చెందిన రైతులు తమ భూముల విషయంలో న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిని మంగళవారం కలిశారు. చట్టప్రకారం అందాల్సిన నష్టపరిహారాన్ని తక్షణమే ఇవ్వాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 109లో ఉన్న అసైన్




భూములను ప్రభుత్వం ఐటీ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు కేటాయించడంతో రైతులు తమ జీవనాధారం కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో బాధిత రైతులు సోమవారం చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావును కలిసి సమస్యను వివరించారు. రైతుల సమస్యను తెలుసుకున్న హరీష్ రావు, కలెక్టర్ వల్లూరు క్రాంతిని ఫోన్ ద్వారా సంప్రదించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.మంగళవారం గోవర్ధన్ రెడ్డి నేతృత్వంలో రైతుల బృందం కలెక్టర్ను ప్రత్యక్షంగా కలుసుకుని తమ బాధలు వివరించారు. చట్టప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని, తమ భూములు జీవనాధారమని, ప్రభుత్వం తక్షణమే పరిహారం ప్రకటించాలని కోరారు.రైతుల వినతులను గమనించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఆర్డీవో రవీందర్ రెడ్డి, వారి సమస్యను పరిశీలించి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు బాధిత రైతులకు తెలిపారు. ప్రభుత్వం ఈ విషయంపై సానుకూలంగా స్పందించాలని రైతులు కోరారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, మంద భాస్కర్ రెడ్డి,సూర్యనారాయణ అంజనేయులు యాదవ్, చంద్రారెడ్డి, రైతులు నారాయణ యాదవ్,మోహన్, మల్లేష్, బీరప్ప, బాషయ్య,రవీందర్, యాదవ్ కిషన్, సత్యనారాయణ, పెంటయ్య, రైతులు పాల్గొన్నారు.

# అక్రమార్కులు మాత్రమే జైలుకు వెళ్లారు

## తమ ప్రభుత్వం వచ్చిన తరువాత అమాయకులపై ఒక్క కేసు కూడా పెట్టలేదు : టిడిపి రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్నా



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ – సురేష్ (శుభోదయం న్యూస్) : గన్నవరం మాజీ ఎమ్మెల్యే వంశీ మోహన్ పై అక్రమ కేసులు పెట్టారంటూ జడ్పిటిసి ఎలిజిబెత్ రాణి చేసిన ఆరోపణలను దొంతు చిన్నా ఖండించారు. మంగళవారం ఆయన గన్నవరం మీడియాతో మాట్లాడుతూ గన్నవరంలో మాజీ ఎమ్మెల్యే వంశీ ప్రోద్బలంతో వైసిపి గుండాలు తన ఇంటిపై దాడి చేసి తన కారును తగలబెట్టారని, అనంతరం టిడిపి కార్యాలయం పై దాడి చేసి కార్యాలయాన్ని ధ్వంసం చేయడంతో పాటు అక్కడ వాహనాలను తగలబెట్టిన సంగతి గన్నవరంతోపాటు రాష్ట్ర ప్రజలందరూ చూశారని గుర్తు చేశారు.టిడిపి కార్యాలయం పైన తన ఇంటి పైన దాడి చేసిన అరాచక శక్తులు మాత్రమే జైలుకు వెళ్లారని చెప్పారు. మీలాగా అక్రమ కేసులతో వేధించడం తెలుగుదేశం పార్టీకి అలవాటు లేదని ఏ తప్పు చేయని చంద్రబాబునాయుడు 52 రోజులపాటు జైల్లో ఉంచిన ఘనత మీ నాయకుడు తుగ్లక్ కె దక్కుతుందన్నారు. గన్నవరం గాంధీ బొమ్మ సెంటర్లో రహదారికు అడ్డంగా కూరగాయల దుకాణాల ఏర్పాటు చేయడంతో రహదారి ఇరుకుగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని దీనిని నివారించేందుకు ఆక్రమణాలను తొలగించామని చెప్పారు. ఇక్కడ దుకాణాలు కోల్పోయిన వారందరికీ రైతు బజార్లో దుకాణాలు కేటాయించామని తెలియచేసారు. జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు మాత్రమే తొలగించామని పరంధామయ్య తోటలో ఒక చెట్టు కూడా తమ కొట్టలేదని చెప్పారుగన్నవరాన్ని సుందరవనంగా తీర్చిదిద్దేందుకు తమ నాయకుడు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కృషి చేస్తున్నారని ఇందులో భాగంగా ఆక్రమణలు తొలగించామని చిన్నా వివరించారుఅబద్దపు ప్రచారాలతో ప్రజల్ని తప్పుదారి పట్టించడం తగదని జెడ్పిటిసికి హితవు పలికారు. బలవంతపు ఏకగ్రీవాలతో జెడ్పిటిసి అయిన ఎలిజిబెత్ రాణి తన స్థాయిని మరిచి మాట్లాడుతున్నారని ఇప్పటికైనా తన స్థాయి తెలుసుకుని మసలుకుంటే బాగుంటుందని దొంతు చిన్నా సలహా ఇచ్చారు.

# మాజీ శాసనసభ్యుడు వల్లభనేని వంశీ అరెస్టు అక్రమం కాదు... సక్రమమే... ఆధారాలున్నాయి



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ – సురేష్ (శుభోదయం న్యూస్) :అక్రమ కేసులు పెడుతున్నారంటూ ఆరోపిస్తున్న గన్నవరం జడ్పిటిసి సభ్యురాలు బహిరంగ చర్చకు రావాలికూటమి ప్రభుత్వం 70 శాతం హామీలు నెరవేర్చిందిప్రజలు ఇచ్చిన తీర్పును వెన్నుపోటు అని అవమానిస్తారాఆస్తి కోసం తల్లి, చెల్లిని ఇంటి నుంచి గెంటేసి.. కుటుంబ వ్యవస్థకు వెన్నుపోటు పొడిచింది జగనేగన్నవరం నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు మేడేపల్లి రమవైసిపి మాజీ శాసనసభ్యుడు వల్లభనేని వంశీ పై అక్రమ కేసులు పెట్టి, కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారంటూ సోమవారం సాయంత్రం గన్నవరం జడ్పిటిసి సభ్యురాలు ఎలిజిబెత్ రాణి విడుదల చేసిన ప్రకటనపై స్పందిస్తూ గన్నవరం నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు మేడేపల్లి రమ ఈరోజు సాయంత్రం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మాజీ శాసనసభ్యుడు వల్లభనేని వంశీ అధికార మదంతో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు నారా లోకేష్ లపై తీవ్రమైన పదజాలంతో దుర్భాషలాడటం ప్రజలందరికీ తెలుసని, అంతేకాకుండా అప్పటి వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించినందుకు గన్నవరం నియోజకవర్గ టిడిపి కార్యాలయాన్ని ధ్వంసం చేశారని, టీడీపీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ గా పనిచేస్తున్న దళిత యువకుడు సత్యవర్ధన్ అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారని అన్నారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో ఘోర ఓటమి చెందిన వల్లభనేని వంశీ తన ప్రస్తుత పరిస్థితిని ముందుగానే ఊహించి సత్య వర్ధన్ ను అపహరించి కిడ్నాప్ చేసి తను పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదును వాపసు తీసుకోవాలని బెదిరించినట్లు ఆధారాలతో సహా పోలీసులు ప్రజల ముందు ఉంచారని ఇది అక్రమ అరెస్టు ఎలా అవుతుందని అన్నారు. అంతేకాకుండా గతంలో మైనింగ్ అక్రమాల ద్వారా కోట్ల రూపాయల ప్రజా సంపదను మాజీ శాసనసభ్యుడు మరియు అతని అనుచరులు కొల్లగొట్టారని దానిపై సిట్ ఎంక్వైరీ జరుగుతుందని రిపోర్టు వచ్చిన వెంటనే దోషులుగా తేలితే చట్టప్రకారం శిక్ష తప్పదని తెలిపారు. నకిలీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయడం పై గతంలోనే అతనిపై పోలీస్ కేసు రిజిస్టర్ అయిందని తెలిపారు.వైసీపీ నేతల ఆస్తులను విధ్వంసం చేస్తున్నారంటూ చేస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ జాతీయ రహదారి పక్కనే కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని యథేచ్ఛగా కబ్జా చేసి సొంత వ్యాపార కార్యకలాపాలను సాగిస్తున్నందున ప్రభుత్వ అధికారులు చర్యలు చేపట్టి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారని, ఇవి ప్రైవేట్ ఆస్తులు కావని, అలాంటప్పుడు కక్షపూరితమైన చర్యలుగా ఎలా అభివర్ణిస్తారని స్థానిక జడ్పిటిసి సభ్యురాలిని సూటిగా ప్రశ్నించారు. రేషన్ దుకాణాలను తిరిగి పునః ప్రారంభించమని ప్రజలు కోరారా అంటూ స్థానిక జడ్పిటిసి సభ్యురాలు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ గత వైసిపి ప్రభుత్వం అమలు చేసిన విధానాలు ప్రజలకు ఆమోదయోగ్యంగా లేవని 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని అఖండ మెజారిటీతో గెలిపించడం ద్వారా తీర్పునిచ్చారని, 151 సీట్లతో ఉన్న వైసీపీకి కేవలం 11 సీట్లు మాత్రమే ఇచ్చి ప్రతిపక్ష హోదాను సైతం ఇవ్వకుండా ప్రజలే బుద్ధి చెప్పారని తెలిపారు.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు గన్నవరం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు విజన్ 2029 ప్రణాళికను రూపొందించుకొని తదనగుణంగా అంతర్జాతీయ విమానశ్రయానికి సమీపంలో ఉన్న గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రిని ఆధునికరించడం, గన్నవరం టౌన్ లో డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేయడం, జాతీయ రహదారుల వెంట పచ్చదనాన్ని పెంపొందించడం, చిరు వ్యాపారుల ఆక్రమణలతో కూచించుకుపోయిన రహదారులను అభివృద్ధి చేయడం తదితర అంశాలను ఇప్పటికే అమలు చేయడం నియోజకవర్గం ప్రజలందరికీ తెలుసని అన్నారు. చిరు వ్యాపారులకు ఇచ్చిన హామీ మేరకు కొంతమందికి ఇప్పటికే రైతు బజార్లో దుకాణాలను కేటాయించామని మిగిలిన వారికి కూడా తమ వ్యాపారాలను నిర్వహించుకునేందుకు త్వరలోనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలం నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ విధ్వంసం నుండి వికాసం వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు.సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం లేదని వైసీపీ నేతలు చేస్తున్న విష ప్రచారం పై స్పందిస్తూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయిన ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల్లో 70 శాతం పథకాలను ఇప్పటికే అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మూడు వేల రూపాయలుగా ఉన్న పింఛను ఒకేసారి ?1000 పెంచి రూ. 4000 చేసి ప్రతినెల 1వ తేదీనే లబ్దిదారులకు అందజేస్తున్నామని, సంవత్సరానికి రూ. 33 వేల కోట్లు పైగానే సామాజిక పెన్షన్లకు ఖర్చు చేస్తున్నామని, ఇది దేశంలోనే రికార్డు అని తెలిపారు. దీపం-2 ద్వారా మొదటి విడతలో ఇప్పటికే 93 లక్షల మందికి పైగా ఉచిత గ్యాస్ సిలిండర్లను అందించామని, రెండో విడత ఇప్పటికే ప్రారంభించామని తెలిపారు. 20 లక్షల ఉద్యోగాల హామీలో భాగంగా 16,347 మెగా డీఎస్సీ పోస్టులకు, 6,100 పోలీస్ రిక్రూట్మెంట్ ఉద్యోగాలకు సైతం ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేసామని, రూ. 8.5 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించి 6 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించే ఏర్పాట్లు చేశామని, ఇవన్నీ ఏడాది కాలంలోనే చేయడం కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని తెలిపారు. తల్లికి వందనం పథకాన్ని జూన్ నెలలో అమలు చేసి హామీ ఇచ్చిన మేరకు చదువుకునే పిల్లలు ప్రతి ఒక్కరికి రూ.15 వేలు వారి తల్లులకు అందజేస్తామని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం లో భాగంగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఆడబిడ్డ నిధి పథకం కోసం కసరత్తు జరుగుతుందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ఇచ్చిన హామీ మేరకు రానున్న ఆగస్టు నెల నుంచి ఈ పథకాన్ని ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వం కనీసం తట్ట మట్టి వేయకుండా గుంతల మయం చేసి వదిలేసిన రోడ్లను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన సరి చేశామని, ప్రతి గ్రామంలోనూ నూతన సిసి రోడ్లను నిర్మించామని తెలిపారు. ఇది కాక రాష్ట్రవ్యాప్తంగా 204 అన్న క్యాంటీన్లు ప్రారంభించి పేదవాడి ఆకలి తీరుస్తున్నామని తెలిపారు. ఇవన్నీ చూసి తట్టుకోలేక వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వం పై విష ప్రచారం చేస్తున్నారని ప్రజలు గమనించాలని కోరారు.అక్రమ కేసుల కు బ్రాండ్ అంబాసిడర్ వైసీపీ పార్టీ అని ఏ తప్పు చేయని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు గారిని 53 రోజులపాటు జైల్లో బంధించారని, రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో అక్రమ కేసులు నమోదు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన చరిత్ర వైసిపి పార్టీదని ఈ సందర్భంగా విమర్శించారు.వైసీపీ నాయకులు చేస్తున్న విష ప్రచారాన్ని నమ్మవద్దని గన్నవరం నియోజకవర్గానికి దొరికిన ఆణిముత్యం యార్లగడ్డ వెంకట్రావు గారని ఆయన తీసుకునే నిర్ణయాలకు మద్దతు తెలుపుతూ గన్నవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని ఈ సందర్భంగా గన్నవరం నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు.

# మలేరియా నివారణ మాసోత్సవాలు



లేపాక్షి మండల రిపోర్టర్ అమరేష్ (శుభోదయం న్యూస్ ) మండల పరిధిలో లేపాక్షి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు మండల వైద్యాధికారి డా. వెంకట చిరంజీవి ఆధ్వర్యం లో ఆశ కార్యకర్తల సమావేశం మరియు మలేరియా నివారణ మాసోత్సవాలు లో భాగంగా మలేరియా నివారణ పైన అవగాహన సమావేశం, గ్రామము నందు ర్యాలీ నిర్వహించడం జరిగినది. వర్షాకాలం ప్రారంభం అయినందు వలన మలేరియా నివారణకు అవసరమైన సూచనలు తెలియచేసారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగ ఉంచుకోవాలని మరియు వ్యక్తిగత పరిశుభ్రత పాటించవలెను.ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిలువ లేకుండా చూసుకోవలెను, అలాగే కొబ్బరి చిప్పలు, పాత టైర్ లు, రోళ్ళు మొదలైన వాటిలో నీరు నిలువ లేకుండా చేసుకోవడము వలన దోమలు గుడ్లు పెట్టీ, %శ్రీఖతీఋ% దశకు రాకుండానే నాశనం చేయవచ్చు, దోమల వ్యాప్తి నీ అరికట్ట వచ్చును. లిలి ఇంటి ఆవరణ లో వేపాకు పొగ వేయడం ద్వారా దోమలను అరికట్టవచ్చులిలి పడుకున్నపుడు దోమతేరలను వాడడం వలన దోమ కాటు నుండి రక్షణ పొందవచ్చునులిలి ప్రతి శుక్రవారం డ్రై డే- ఫ్రైడే పాటించడం వలన దోమల వ్యాప్తిని అరికట్ట వచ్చును. ఎవరికైనా మూడు రోజుల నుండి చలి తో కూడిన జ్వరము వున్న యెడల సమీప హాస్పిటల్ లో చికిత్స చేయించుకొనవలెనని వైద్యాధికారి తెలియచేసారు. కార్యక్రమం లో సుబ్రమన్యం, భాగ్యలక్ష్మీ, లు,ఆరోగ్య మరియు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



# జర్నలిస్ట్ అండ్ ఫోటోగ్రాఫర్ నాగేశ్వరరావు మృతి బాధాకరం : మురళి గౌడ్



(శుభోదయం న్యూస్), బాపట్ల: పట్టణం శృంగారపురం నికి చెందిన సీనియర్ ఫోటోగ్రాఫర్,జర్నలిస్ట్ గగ్గూరి నాగేశ్వరావు గారి అకాల మృతికి నివాళు లర్పిస్తూ వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియచేస్తున్నా, బీసీ బడుగు బలహీన వర్గాల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఉప్పాల మురళి గౌడ్ బడుగు బలహీన వర్గాల నాయకులు,


# భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

## చుంచు రాజేందర్,డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు.



శుభోదయం న్యూస్, హసన్పర్తి: మంగళవారం నుండి రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ పిలుపునిచ్చారు.మంగళవారం నాడు దేవన్నపేట గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సును మండల రెవెన్యూ అధికారులు నిర్వహించారు.ఈ సందర్భంగా హసన్పర్తి తహసిల్దార్ చల్లా ప్రసాద్ మాట్లాడుతూ రైతుల సంబంధించిన భూ సమస్యల పరిష్కారానికి ఈ నెల 3 తేదీ నుండి మండలంలోని అన్ని గ్రామాలలో ఈ నెల 20 వరకు జరుగుతున్న రెవెన్యూ సదస్సులలో రైతులు పాల్గొని వారికున్న తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. తమ వ్యక్తిగత భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు చేసుకొని రసీదు తీసుకోవాలని కోరారు.ఈ సదావకాశాన్ని రైతులు ఉపయోగించు కోవాలన్నారు ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, డిప్యూటి తహసిల్దార్,రెవెన్యూ ఇన్స్ పెక్టర్ ఫజిల్,65 వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయ్యల రాంరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు శ్రీపతి మల్లేశం,నాయకులు బాపురెడ్డి,పొలెపల్లి రవి,వీరస్వామి, రైతులు ఓదేలు,తిరుపతి, బుచ్చిరెడ్డి, రాజు,రవిందర్,సాయి,సత్యం, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పువ్వాడి వారి వివాహ వార్షికోత్సవ వేడుకలో పాల్గొన్న టిడిపి నాయకులు మల్లెల బ్రహ్మయ్య ఆవుల రవణమ్మ



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్)పామూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు దంపతుల వివాహ వార్షికోత్సవం కార్యక్రమం పువ్వాడి అపార్ట్మెంట్లో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో పామూరు పట్టణ టిడిపి నాయకులు మల్లెల బ్రహ్మయ్య, ఆవుల రవణమ్మ పాల్గొని వాళ్లకి సాలువ పూలదండలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జనసేన నాయకులు పాల్గొన్నారు

# జిన్నారం మండల పరిధిలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మోడల్ హౌసును ప్రారంభించిన జిఎంఆర్




జిన్నారం, (శుభోదయం న్యూస్): సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం జిన్నారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఐదు లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు మోడల్ హౌస్ ను ప్రారంభించిన పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి. హాజరైన ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, మండల అధ్యక్షుడు వడ్డే కృష్ణ, నారా బోయిన శ్రీనివాస్ వివిధ శాఖల అధికారులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# గన్నవరం ఎమ్మెల్యేగా యార్లగడ్డ వెంకట్రావ్ ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి,




గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ – సురేష్ (శుభోదయం న్యూస్) : సంక్షేమ కార్యక్రమాలపై ఆయన అభిమానులు కరపత్రాలు ముద్రించి విడుదల చేశారు. గన్నవరం ఎమ్మెల్యేగా వెంకటరావు చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఈ కరపత్రంలో వివరించారు. నియోజకవర్గంలోని పోలవరం కాలువ పరివాహక ప్రాంతంలో రైతుల సాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు రూ 1.25 కోట్ల సొంత నిధులతో ఉన్న మోటార్లను కొనుగోలు చేసి రైతులకు ఉచితంగా ఇచ్చిన సంగతిని గుర్తు చేశారు. అరాచకాలు అక్రమాలకు నిలయమైన గన్నవరం నియోజకవర్గాన్ని ప్రశాంతంగా ఉంచేందుకు కృషి చేస్తానన్న యార్లగడ్డ ఆదిశగా చేస్తున్న ప్రయత్నాలను కరపత్రంలో సోదాహరణంగా వివరించారు. గన్నవరం దశ దిశ మార్చేందుకు యార్లగడ్డ చేస్తున్న కృషిని ఈ కరపత్రంలో వివరించడంతోపాటు నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు పారిశ్రామిక అభివృద్ధికి యార్లగడ్డ చేస్తున్న శ్రమను ఇందులో పొందుపరిచారు. మల్లవల్లి పారిశ్రామిక వరకు పున్నర్ వైభవం తీసుకొచ్చేందుకు యార్లగడ్డ పడుతున్న తపనను ఈ కరపత్రంలో ముద్రించారు. ఈ సంవత్సర కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. మంగళవారం రాత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డీసీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ,, నూలు నరసింహారావు, కోనేరు సందీప్ లు కరపత్రాలను యార్లగడ్డ కు అందజేశారు.




# మహిళా పొదుపు ద్వారానే అభివృద్ధి 19వ వార్షిక మహాసభలో గాయపు ఉమాదేవి...




శుభోదయం న్యూస్, సంగెం: శాంతి మండల సమైక్య 19వ వార్షికోత్సవ మహాసభలో మండలంలోని 49 గ్రామ సంఘాల కార్యవర్గ సభ్యులు పాల్గొని గత సంవత్సరానికి సంబంధించిన జమలు చెల్లింపులు ఆదాయ, వ్యయాలు లాభనష్టాలపై కూలంకుషంగా చర్చించడం జరిగింది. ఆరు లక్షల రూపాయల లాభంతో సమైక్య నడుస్తుందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సభ్యులందరూ కూడా బ్యాంకు రుణాల ద్వారా జీవనోపాదులను ఏర్పాటు చేసుకుంటూ ముందుకు సాగాలని తెలిపారు, రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాల ద్వారా మహిళలను కోటీశ్వరులు చేయాలని సంకల్పంతో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మండల సమాఖ్య కు బస్సు కొనుగోలుకొరకు 30 లక్షలు గ్రాంట్ మంజూరి చేపించారు, కుసుం ప్రాజెక్టులో 1కిలో మేఘా వాట్స్ సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయుటకు పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య సంప్రదా యోజన పథకంలో మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్లెట్ యూనిట్ మంజూరు చేశారు, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ విజయవంతంగా నడుస్తుందని తెలిపారు, సహకార పద్ధతిలో 16 మహిళా డెయిరీ సొసైటీ లు ఏర్పాటుకు సహకారం అందించారని శాంతి మండల సమైక్య అధ్యక్షురాలు గాయపు ఉమాదేవి,కార్యదర్శి కోశాధికారి చీకటి రమ్యశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం కిషన్ సీసీలు సురేశ్ ,కుమారస్వామి, ఏలియా,రాజయ్య,కృష్ణమూర్తి, సుజాత, కృష్ణ, శివరాజ్, తదితరులు పాల్గొన్నారు.



## డివిజన్ల అభివృద్ధికి నిధులకు కేటాయించండి

## జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ తో సమావేశమైన ఎమ్మెల్యే జిఎంఆర్



పటాన్చెరు, (శుభోదయం న్యూస్): బల్దియా పరిధిలోని భారతి నగర్, పటాన్చెరు, రామచంద్రపురం డివిజన్ల పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలలో మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించాలని.. నూతన పారిశుద్ధ్య వాహనాలు పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు సహకారం అందించాలని శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ ను పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కోరారు.మంగళవారం శేరిలింగంపల్లి జిహెచ్ఎంసి. జోనల్ కమిషనర్



కార్యాలయంలో జోనల్ కమిషనర్ హేమంత్ తో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మూడు డివిజన్ల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు, పెండింగ్ పనులపై చర్చించారు. పారిశుద్ధ విభాగంలో దీర్ఘకాలంగా సెలవులో ఉన్న ఉద్యోగులు, చనిపోయిన వారి స్థానాల్లో నూతన ఉద్యోగులను నియమించాలని కోరారు. పటాన్చెరు డివిజన్ పరిధిలో నిర్మిస్తున్న ఆడిటోరియం, కమ్యూనిటీ హాల్స్, వార్డ్ ఆఫీస్ నిర్మాణ పనులు చాలా రోజులుగా నిలిచిపోయాయని వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆడిటోరియం, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణ పూర్తయితే ప్రభుత్వ ప్రైవేటు కార్యక్రమాలకు ఆధునిక వసతులతో కూడిన భవనం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పారిశుద్ధ్య విభాగంలో వాహనాల కొరత మూలంగా చెత్త సేకరణ ఇబ్బందిగా మారుతోందని.. వెంటనే నూతన వాహనాలతో పాటు మినీ టిప్పర్లు, నిచ్చెనులతో కూడిన వాహనాలను కేటాయించాలని కోరారు.ఇందుకు సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ హేమంత్.. అతి త్వరలో సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సురేష్, ఎస్ ఈ శంకర్ నాయక్, డి ఈ నరేందర్, దేవేందర్, ఏఈ శివ తదితరులు పాల్గొన్నారు.

## క్యాబినెట్ సమావేశంలో

## ఆర్ఎంపీల సమస్య చర్చించాలి : కొండి శెట్టి సురేష్



విజయవాడ, శుభోదయం న్యూస్: భారత దేశంలో గ్రామాలలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి పైసలు లేకున్నా ప్రధమ చికిత్స చేసే గ్రామీణ వైద్యులు ప్రజలు దేవుడితో సమానంగా భావిస్తారు భారతదేశంలో స్వాతంత్రం వచ్చిన నాటి నుండి నేటి వరకు భారతదేశంలో ఎన్ని విధాలుగా అభివృద్ధి చెందినప్పటికీ నేటికీ శాశ్వత పరిష్కారం కానీ సమస్య గ్రామీణ వైద్యుల సమస్య నాయకులు మంత్రులు ఎన్నికల సమయంలో మాత్రమే గ్రామీణ వైద్యులను సహాయ సహకారాలు అందించాలని కోరుకుంటారు అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం అపాయింట్మెంట్ కూడా ఇవ్వలేదు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నమ్మి మోసపోవడం గ్రామీణ వైద్యులకు ఎన్నో సంవత్సరాలుగా జరుగుతున్నది నేటికి గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరిస్తామని అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రులు సమస్యను పరిష్కరిస్తారని ఆశగా ఎదురు చూస్తున్నరు పేదవాడికి ప్రధమ చికిత్స భారత దేశవ్యాప్తంగా 75% ఒక గ్రామీణ వైద్యులు మాత్రమే చేయుచున్నారు డాక్టర్లు లేని మండలాలు వేల సంఖ్యలో ఉన్నాయి ప్రజలు నమ్మకం గ్రామీణ వైద్యుడు ప్రజలు కోరుకునేది గ్రామీణ వైద్యుడు చేత ప్రధమ చికిత్స కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి కార్పొరేట్ ఆసుపత్రుల స్థాపించి లక్షల బిల్లులకు భయపడి ప్రజలు మొదటగా వైద్యం కోసం గ్రామీణ వైద్యుడు దగ్గరికి మాత్రమే వెళతారు నాటి నుండి నిస్వార్థ సేవ చేయుచున్న గ్రామీణ వైద్యులు కుటుంబ సభ్యుల వలె ప్రజలతో కుటుంబ సభ్యులు గా ఉంటూ ప్రభుత్వం చేయుచున్న మంచి పథకాలను ప్రజలకు తెలియజేస్తూ ఆరోగ్య విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఒక కుటుంబ సభ్యుని వలె ప్రజలకు తెలియజేస్తారు ప్రజల చేత ప్రజా డాక్టర్ గా పిలవబడే గ్రామీణ వైద్యులు ప్రజల మండలాలతో ప్రజల ఆశీస్సులతో నేటికీ జీవనం సాగించుచున్నారు కార్పొరేట్ ఆసుపత్రి యాజమాన్యాలు కోట్లు ఖర్చుపెట్టి గ్రామీణ వైద్యుల వ్యవస్థను తొలగించాలని నిర్మూలించాలని న్యాయస్థానాలను ఆశ్రయించినప్పటికీ ప్రజల మద్దతుతో ప్రజలకు ప్రథమ చికిత్స వైద్యం చేయుచున్నరు గ్రామీణ వైద్యులను తొలగించడం కష్టసాధ్యమని తెలపడం జరిగింది. కొందరు స్వార్ధపరులు కార్పొరేట్ ఆసుపత్రి యాజమాన్యం కొందరు అవినీతి అధికారులు తో కలిసి గ్రామీణ వైద్యుల మీద దాడులు చేయించి భయభ్రాంతులకు గురి చేయుచున్నారు న్యాయస్థానానికి ఆధారాలు సేకరించుట కొరకు కొందరు అధికారులు కార్పొరేట్ ఆసుపత్రుల యజమానులతో కుమ్మక్కు అయి గ్రామీణ వైద్యుల మీద దాడులు నిర్వహించి వారి మీద కేసులు బనాయించి గ్రామీణ వైద్యుల వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయడానికి ప్రయత్నాలు చేయుచున్నారు నిత్యం ప్రజా సేవలో ప్రథమ చికిత్స చేయు ప్రాణాలు సైతం లెక్కచేయక కుటుంబాన్ని సైతం వదిలి ప్రజలకు ప్రజలు చికిత్స చేయుచున్న గ్రామీణ వైద్యులను ఎన్ని విధాలుగా భయభ్రాంతులకు గురి చేసినప్పటికీ కొందరు అవినీతి అధికారులు దొంగ నాయకులు రౌడీ లు ప్రభుత్వం నికి వ్యతిరేకంగా పని చేయు దళాలు కొందరు స్వార్ధపరులు బెదిరించి నప్పటికీ నవ్వుతు ప్రజల సహకారంతో వారి జీవనం సాగించు చున్నారు అని జాతీయ ఆర్ఎంపీ పీ ఎంపీ సంఘాల సమైక్య అధ్యక్షులు కొండి శెట్టి సురేష్ బాబు తన కార్యాలయంలో ఒక ప్రకటనలో తెలియ చేశారు.

## పారిశుద్ధ్య విభాగానికి చెందిన

## 18 మందికి ఆయుష్మాన్ హెల్త్ కార్డుల పంపిణీ

## రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ



రామగుండం మండలం, రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్): పారిశుద్ధ్య సిబ్బంది సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) జె. అరుణ శ్రీ అన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం ఎన్ టి పి సి మిలీనియం హాల్ లో నిర్వహించిన



కార్యక్రమంలో రామగుండం నగర పాలక సంస్థ పారిశుద్ధ్య విభాగంలో డ్రెయిన్ క్లీనర్ లుగా గా పని చేస్తున్న 18 మందికి ఆయుష్మాన్ హెల్త్ కార్డులను ఆమె పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ. రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా వచ్చే రూ 10 లక్షల రూపాయలకు అదనంగా ఆయుష్మాన్ హెల్త్ కార్డ్ ద్వారా మరో ఐదు లక్షల వరకు నగదు రహిత వైద్య సేవలు అందుకోవచ్చని తెలిపారు. త్వరలోనే మరికొంత మంది డ్రెయిన్ క్లీనర్లకు కూడా ఈ కార్డు అందజేయడం జరుగుతుందని తెలిపారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ , ప్రైవేటు వైద్య సంస్థల సహకారంతో పారిశుద్ధ్య కార్మికుల కొరకు వైద్య శిబిరాలు కూడా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఇ ఇ రామన్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ , తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిఖని లో కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల సంచలనం

## జేఈఈ అడ్వాన్స్డ్ ఫలితాల్లో "మోక్షిత్"కు 2835 ర్యాంక్

### చైర్మన్ డా రవికుమార్ నాగండ్ల




**గోదావరిఖని టౌన్, రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్): కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల ఆల్ ఇండియా స్థాయిలో ప్రతిభ చాటినది. సోమవారం విడుదల అయిన జేఈఈ ఫలితాల్లో "రాచపల్లి మోక్షిత్"కు 2835 ర్యాంక్ సాధించాడు. ఈ మేరకు మంగళవారం కళాశాలలో చైర్మన్ డా: రవికుమార్ నాగండ్ల సూచన మేర ర్యాంకర్ మోక్షిత్ ను ప్రిన్సిపల్ ఎం వెంకన్న ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేసి మిఠాయి తినిపించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మీడియాతో మాట్లాడుతూ.టీచింగ్ మెథడ్స్, ఎంట్రన్స్ బుక్స్ ద్వారా ఆల్ ఇండియా ర్యాంకులు గత పది ఏండ్లుగా**




**సాధ్యమవుతున్నట్లు తెలిపారు. కళాశాలను స్థాపించి 12 సంవత్సరాలుగా అన్ని రకాల ఎంట్రెన్స్ పరీక్షలలో, ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామ్స్ ఫలితాలలో ప్రభంజనం సృష్టిస్తున్నది అని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తుండడం ఆనందాన్ని కలిగిస్తున్నదని అన్నారు. కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల గోదావరిఖని ప్రాంతంలో విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే విద్యాలయంగా కీర్తింపబడడం విద్యార్థుల విజయం పట్ల తమ బాధ్యతను రెట్టింపు చేస్తున్నదని తెలిపారు. కోల్ బెల్ట్ ఆణి ముత్యాలకు కృష్ణవేణి వికాస్ పదును పెట్టే సరస్వతి నిలయమని ప్రశంసించారు. దేశంలోనే అత్యంత ప్రాచుర్యం పొందిన జేఈఈ అడ్వాన్స్డ్ ఫలితాలలో కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల విద్యార్థి మోక్షిత్ 2835 ర్యాంకు సాధించడం చరిత్రపుటల్లో లిఖించే సంతోషమైన సందర్భంగా అభివర్ణించారు. ఈ యొక్క సన్మాన కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు ఆఫీస్ స్టాఫ్, ర్యాంకర్ మోక్షిత్ మాతృమూర్తి వసంత గారు పాల్గొన్నారు.**

## గోదావరిఖని లో సిమ్స్ మెడికల్ కాలేజీలో 15 లక్షలతో

## ఏర్పాటు చేసిన నూతన జిమ్ ప్రారంభం

## రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్



రామగుండం మండలం, రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్): రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గోదావరిఖని పట్టణంలోని ప్రముఖ సిమ్స్ మెడికల్ కాలేజీలో నూతనంగా 15 లక్షలతో ఏర్పాటు చేసిన జిమ్నాసియాన్ని (జిమ్) ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ విద్యార్థులతో ముచ్చటించారు. వారి విద్యా, వసతి, ఆరోగ్య సంబంధిత సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని విధాలుగా మద్దతు ఇవ్వనుందని, కళాశాలలో



మరింత ఆధునిక వసతులు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు మంచి ఫిజికల్ మరియు మెంటల్ హెల్త్ కోసం అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలి. మీరు బాగా చదివి ఉన్నతస్థాయిలో ఎదగాలి. ఇదే మా ఆశయము. విద్యారంగ అభివృద్ధే మన భవిష్యత్ శక్తికి ఆధారం" అని తెలిపారు. కాలేజీలో విద్యార్థుల కోసం ఇలాంటి వసతుల అందుబాటులోకి రావడం ఆనందదాయకం అని పేర్కొంటూ, విద్యార్థుల సంక్షేమం కోసం అన్ని రంగాలలో కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వీరి వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్లు వివిధ విభాగల అధ్యక్షులు తదితరులున్నారు.



# నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం

**ముఖ్య అతిథిగా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్.**

**రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ**




రామగుండం మండలం రిపోర్టర్ - తిరుపతి, (శుభోదయం న్యూస్): ఎన్ టి పి సి మిలీనియం హాల్ లో మంగళవారం రామగుండం నగర పాలక సంస్థతో పాటు వివిధ విభాగాల అధికారులు , సిబ్బందితో నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) %ు% కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) జె. అరుణ శ్రీ తో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన తరువాత నగరంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతున్నదని అన్నారు. వీటన్నిటినీ ప్రజల్లోకి తీసుకువెళ్ళి వివరించాల్సిన భాధ్యత క్షేత్ర స్థాయిలో పని చేస్తున్నమున్సిపల్ వార్డు అధికారులు తీసుకోవాలని అన్నారు. అర్హులకే ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు దక్కేటట్లు క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలని వార్డు అధికారులకు సూచించారు. అధికారుల పని తీరుతో ప్రభుత్వ గౌరవ ప్రతిష్టలు పెరుగుతాయని అన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలతో ప్రజల ఆరోగ్యం. నగర సౌందర్యం ముడిపడి ఉన్నందున ఎలాంటి లోటు పాట్లు లేకుండా




పటిష్టంగా పారిశుద్ధ్య సేవలు అందించాలని అన్నారు. నగర పాలక సంస్థలో అవసరమైన పారిశుద్ధ్య సిబ్బంది , వాహనాలు అందుబాటులో ఉన్నందున నిబద్దత తో పని చేసి నగరాన్ని పరిశు భ్రమైన నగరంగా తీర్చిదిద్దాలని అన్నారు. చీకట్లో అవాంఛనీయ సంఘటనలు నియంత్రించడానికి వీధి దీపాలన్నీ వెలిగేలా చూడాలని అన్నారు. రాబోయే వర్షాకాల%శీ% దృష్ట్యా మరింత అప్రమత్తంగా ఉండాలని వీధి దీపాల నిర్వాహక సిబ్బందిని ఆదేశించారు. ప్రతి అభివృద్ధి పని నాణ్యతతో , సకాలంలో పూర్తయ్యేలా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. ప్రజల సౌకర్యార్థం రోడ్డు విస్తరణ పనుల్లో రాజీ పడే ప్రసక్తి లేదని అన్నారు. రోడ్డు డివైడర్ మధ్యలో నాటిన కోనోకార్పస్ చెట్లను తొలగించి వాటి స్థానంలో బోగన్ విల్లా , పామ్ ట్రీ తదితర జాతులకు చెందిన మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.అలాగే ప్రహరీ గోడల ప్రక్కన రోడ్డుకు అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగించాలని ఎన్ టి పి సి అధికారులను ఆదేశించారు.వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పెద్ద సంఖ్యలో మొక్కలు నాటి , వాటి సంరక్షణా చర్యలు చేపట్టాలని అన్నారు. శాలపల్లి రోడ్డు విస్తరణకు సహకరించాలని ఎన్ టి పి సి అధికారులను కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని రామగుండం ఎం ఆర్ ఓ ను ఆదేశించారు. గ్రామాల నుండి రాజీవ్ రహదారిలోకి ప్రవేశి%శీ%చే క్రమంలో తరచుగా ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో అవసరమైన చోట్ల గ్రామ రహదారి పై స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని ఆర్ అండ్ బి అధికారులు , హెచ్ కె ఆర్ సంస్థ ప్రతినిధులకు సూచించారు. లారీలు మెయిన్ రోడ్ల ప్రక్కన నిలపకుండా ఆటో నగర్ లోనే పార్కింగ్ చేసుకునేలా చూడాలని ట్రాఫిక్ పోలీస్ అధికారులను ఆదేశించారు. రాజీవ్ రహదారి వెంబడి రోడ్డు కు అడ్డుగా ఉన్న విద్యుత్ టవర్లు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ట్రాన్స్ కో అధికారులను ఆదేశించారు. మల్కాపూర్ శివారులో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి వీలుగా లోతట్టు ప్రాంతాన్ని మట్టితో పూడ్చి చదును చేయాలని సింగరేణి అధికారులను కోరారు. అమృత్ 2.0 పథకం కింద చేపడుతున్న ఎస్ టి పి నిర్మాణ పనులను వేగిర%శీ% చేయాలని అన్నారు. గత అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ వర్షాకాలంలో శాంతి నగర్ ప్రాంతం ముంపుకు గురి కాకుండా నాలా నిర్మాణం చేపట్టాలని ఆర్ ఎఫ్ సి ఎల్ అధికారులను ఆదేశించారు. ఈ సంధర్భంగా రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా చేపడుతున్న వివిధ పనులను అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) జె, అరుణ శ్రీ ఎం ఎల్ ఎ కు వివరించారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేయడంలో ఉత్తమ పని తీరు కనబర్చిన వార్డు అధికారులకు, వివిధ విభాగాల అధికారులకు , సిబ్బందికి పురస్కారాలు అందజేస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఎ సి పి లు ఎం. రమేష్, సి హెచ్ శ్రీనివాస్ , నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఎస్ ఇ శివానంద్ , ఇ ఇ రామన్ , ఎ సి పి శ్రీ హరి , రామగుండం తహశీల్దార్ దత్తు ప్రసాద్ , ఎన్ టి పి సి అధికారులు మయా%శీ%క్,బాలసుబ్రహ్మణ్యన్ ,సూర్యనారాయణ , ప్రవీణ్ చౌదరి , సింగరేణి అధికారులు వసంత్ కుమార్ , సునీత , ధనుంజయ్ , సాంబశివ రావు , కుమార స్వామి , సత్యా రావు , ఎన్ పి డి సి ఎల్ . డి ఇ ప్రభాకర్ , ఎ డి ఇ లు వెంకటేశ్వర్లు , రమేష్ , డి ఎఫ్ ఓ శివయ్య , ఎఫ్ ఆర్ ఓ ఎం . వి . నాయక్ , ఆర్ బి అధికారులు జావీద్ , హెచ్ కె ఆర్ ప్రాజెక్ట్ మేనేజర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


శుభోదయం
WWW.SUBHODAYAMDAILY.COM
ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!
జనరల్ న్యూస్
బుధవారం - 04 - జూన్ - 2025

## దేశంలో పెరుగుతున్న కరోనా కేసులు..! ఆ రాష్ట్రంలోనే ఎక్కువ రోగులు..



**న్యూఢిల్లీ,:** భారతదేశంలో కరోనా వైరస్ కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. యాక్టివ్ కేసుల సంఖ్య భారీగా పెరుగుతుండటంతో పాటు మరణాలు కూడా రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. మంగళవారం ఉదయం వరకు దేశవ్యాప్తంగా యాక్టివ్ కేసుల సంఖ్య 4 వేల మార్కును దాటింది. గడిచిన 24 గంటల్లో ఐదుగురు కరోనా సోకి చనిపోయారు. అయితే, ప్రస్తుతం దేశంలో కరోనా బారిన పడిన రాష్ట్రాలలో కేరళ అగ్రస్థానంలో ఉండగా.. ఆ తర్వాత మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ ఉన్నాయని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కాగా, దేశంలో నమోదవుతున్న కరోనా కేసుల్లో కేరళ మొదటి స్థానంలో కొనసాగుతుండటంతో అధికారులు తగిన చర్యలు చేపట్టారు. మంగళవారం ఒక్కరోజే కేరళలో 171 కొత్త కేసులు నమోదు అయినట్లు తెలిపారు. రాష్ట్రంలో మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య ఇప్పటి వరకు 1,416కి చేరింది. ఇక, ఢిల్లీలో యాక్టివ్ కేసుల సంఖ్య 393కు చేరగా, మహారాష్ట్రలో 69 కొత్త కేసులు నమోదు అయ్యాయి. ఇక్కడ యాక్టివ్ కేసుల సంఖ్య 494కు చేరుకుంది. పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా 11 కేసులు నమోదు అవగా.. ఆ రాష్ట్రంలో యాక్టివ్ కేసుల సంఖ్య 372గా ఉందని ఆరోగ్య శాఖ తెలిపింది. అయితే, ఇండియాలోని దక్షిణ, పశ్చిమ రాష్ట్రాల్లో కొవిడ్ కేసుల పెరుగుదలకు ఒమిక్రాన్ సబ్ వేరియంట్లే కారణమని ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ రాజీవ్ బహల్ ధృవీకరించారు. ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న ఈ సబ్ వేరియంట్లు తీవ్రమైనవి కాదని స్పష్టం చేశారు. తాజా, పరిస్థితి ప్రజలు గమనిస్తూ, అప్రమత్తంగా ఉండాలి.. కానీ, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన వెల్లడించారు. ఆరోగ్య నిపుణుల సూచనల మేరకు తగిన జాగ్రత్తలు పాటిస్తూ.. కరోనా వ్యాప్తిని అరికట్టడంలో ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఇందిరా పార్క్ వద్ద నేడు తెలంగాణ జాగృతి మహాధర్నా



**హైదరాబాద్, :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కమిషన్ నోటీసులు ఇచ్చినందుకు నిరసనగా తెలంగాణ జాగృతి భారీ ధర్నాకు పిలుపునిచ్చింది. జూన్ 4న బుధవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ మహాధర్నా ఇందిరా పార్క్ వద్ద జరగనుంది. ఈ ధర్నాను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్వయంగా నేతృత్వం వహించనున్నారు. కేంద్ర సంస్థలు కేసీఆర్‌పై టార్గెట్ చేసినట్లు ఆరోపిస్తూ, ఇది రాజకీయ కుట్రగా అభివర్ణిస్తూ జాగృతి నిరసన కార్యక్రమాన్ని చేపట్టనుంది. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు సంబంధించి విజిలెన్స్, ఎన్‌డిఎస్‌ఏ నివేదికల అనంతరం కేసీఆర్‌కు నోటీసులు రావడం, దానిపై తెలంగాణ భవనుల నుండి కార్యకర్తల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ మహాధర్నా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ మాజీ సీఎం ప్రతిష్టను దెబ్బతీయాలని జరుగుతున్న చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జాగృతి ఈ నిరసన చేపడుతోందని కవిత పేర్కొన్నారు. ఈ మహాధర్నాలో జాగృతి కార్యకర్తలు, తెలంగాణ సంస్కృతి సంఘాల ప్రతినిధులు, నాయకులు భారీగా పాల్గొనే అవకాశం ఉంది. అధికార సంస్థల నిర్ణయాలను ప్రశ్నించే స్థాయిలో ఇది కీలక కార్యక్రమంగా మారనుంది.

## ఈ నెల 5న కేబినెట్ సమావేశం.. కీలక అంశాలపై చర్చ



**హైదరాబాద్, :** రాష్ట్రంలో కొనసాగుతోన్న తెలంగాణ ప్రభుత్వం కీలక అభివృద్ధి, పరిపాలనా అంశాలపై చర్చించేందుకు జూన్ 5న కేబినెట్ సమావేశం నిర్వహించనుంది. మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్ర సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం కీలక నిర్ణయాలకు వేదికకానుంది. ఈ సమావేశంలో పలు ముఖ్య అంశాలపై చర్చ జరగనుంది. ముఖ్యంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఇచ్చిన నివేదికపై ఈ సమావేశంలో విశ్లేషణ జరగనుంది. పాత పింఛన్ విధానం, ప్రమోషన్లు, బదిలీలు, ఖాళీల భర్తీ తదితర అంశాలపై తీసుకునే నిర్ణయాల కోసం ఇది కీలకంగా మారింది. వివాదాస్పదంగా మారిన కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇటీవల ఎన్‌డిఎస్‌ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ), విజిలెన్స్ విభాగాలు సమర్పించిన నివేదికలపై కేబినెట్‌లో చర్చించనున్నారు. లోపాల పరిశీలన, బాధ్యుల నిర్ధారణ, తదుపరి చర్యలపై మంత్రివర్గం నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. యువత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘రాజీవ్ యువ వికాసం’ పథకం అమలు అంశంపై కూడ కేబినెట్ చర్చించనుంది. ఇందులో భాగంగా యువతకు శిక్షణ, ఉపాధి అవకాశాలు, స్కిల్లింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి అంశాలు చర్చకు రానున్నాయి. ఈ సమావేశం ద్వారా రాష్ట్ర పరిపాలనలో కీలక మలుపులు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో సానుకూల నిర్ణయాలు తీసుకునే సూచనలు కనిపిస్తున్నాయి.

## నేడు వెన్నుపోటు దినోత్సవం. అందరు పాల్గొనాలి



**అమరావతి,:** జూన్ 4న వెన్నుపోటు దినానికి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో మేము అమలు చేసిన పథకాలను ఆపేశారు. వారు ఇస్తామన్నా సూపర్-6 పథకాలను ఇవ్వలేదు. ఇప్పటివరకు 143 హామీలను పట్టించుకోలేదు. ఈ పాలనకు వ్యతిరేకంగా రేపు జరిగే వెన్నుపోటు దినములో ప్రతి ఒక్కరు వారి నియోజకవర్గాల్లో పాల్గొనాలని జగన్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వంపై ప్రతి ఒక్కరు నోరు నిత్య మాట్లాడాలి. ఈ ప్రభుత్వ పాలన ఎవరికి మంచిది కాదని జగన్మోహన్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం జగన్మోహన్ రెడ్డి మాట్లాడిన ఈ మాటలు వైరల్ గా మారుతున్నాయి. అటు మాజీ మంత్రి జగన్ మోహన్ రెడ్డిపై జనసేన నేత కిరణ్ రాయల్ సంచలన కామెంట్లు చేశారు. వెన్నుపోటు దినం వైసిపి పార్టీ నిర్వహించనున్న నేపథ్యంలో జనసేన నేత కిరణ్ రాయల్ సెటైర్లు పేల్చారు. వెన్నుపోటు దినం కాదు గుండెపోటు దినాన్ని ప్రకటించాలి. బాబాయ్ ఆత్మకు శాంతి కలగాలంటే తప్పకుండా గుండెపోటు, గొడ్డలి పోటు దినాన్ని నిర్వహించాలని కిరణ్ రాయల్ అన్నారు. మార్చి 15న గుండెపోటు దినంగా ప్రకటించాలని కోరుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థకు మెయిల్ చేశామంటూ కిరణ్ రాయల్ సంచలన కామెంట్లు చేశారు. కాగా కూటమి ప్రభుత్వ పాలనకు రేపటితో సంవత్సరం పూర్తి కావస్తోంది. ఈ నేపథ్యంలో

## ఎండలు ముందే ముగిశాయెందుకు?

### గత ఏడాది మే, జూన్ నెలల్లో భగభగలు.. ఈసారేమో చల్లదనం

### దేశవ్యాప్తంగా చాలాచోట్ల వర్షాలు

### వాతావరణ మార్పులే కారణం



మే నెల భానుడి ప్రచండ వేడికి పెట్టింది పేరు. రోహిణి కార్తెలో రోకళ్లు పగులుతాయని పెద్దల మాట. సూర్యప్రకోపానికి జనం విలవిల్లాడిపోయే కాలంగా ఎండాకాలం దశాబ్దాలుగా పేరు తెచ్చుకుంది. కానీ ఈసారి మే నెలలో దాదాపు వేడి మాయమై చల్లదనమే రాజ్యమేలింది. దేశవ్యాప్తంగా చాలా చోట్ల వర్షాలు పడ్డాయి. పైగా ముందస్తుగానే ఎండాకాలం జనాలకు బైబై చెప్పి వెళ్లిపోయింది. 2024లో మే, జూన్ నెలల్లో ఎండలు విపరీతంగా ఉండటంతో 2025లో ఆదిత్యుడు ఇంకెంత రెచ్చిపోతాడోనన్న భయాలను పటాపంచలు చేస్తూ ఈసారి మే నెలలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలోనే నమోదవడం విశేషం. తక్కువ ఎండలకు తోడు తక్కువ రోజులే ఎండాకాలం కొనసాగడం గమనార్హం. వేడిమి, ఉక్కబోతతో విసుగుతెప్పించే వేసవికాలం వేగంగా గడిచిపోయింది. 2024 సంవత్సరం భూమి మీద అత్యంత ఉష్ణమయ ఏడాదిగా చరిత్రలో నిలిచిపోయింది. ఇక భారత్‌లో గత ఏడాది మేలో దేశవ్యాప్తంగా వడగాలులు చండ ప్రచండంగా వ్యాపించి జనాన్ని బెంబేలెత్తించాయి. ఇందుకు పూర్తి భిన్నంగా 2025 మేనెల సాగిపోవడం సాధారణ ప్రజానీకాన్ని ఆశ్చర్యంలో, ఒకింత ఆలోచనలో పడేసింది. ఈసారి దేశ వాతావరణ ముఖచిత్రంలో మార్పులొచ్చాయని కొందరు విశ్లేషణలు మొదలెట్టారు.

### 2024 మే, జూన్‌లో..

గత ఏడాది మే, జూన్ నెలల్లో దేశవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదుకావడంతోపాటు వడగాల్పుల ఘటనలు చాలా చోట్ల సంభవించాయి. దీంతో చాలా ప్రాంతాల్లో కరువు తాండవించింది. దీంతో జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటాయి. నీటి లభ్యత బాగా తగ్గిపోయింది. భూగర్భజలాలు మరింత కిందకు వెళ్లిపోయాయి. విద్యుత్ కొరత సమస్య సైతం అధికమైంది. వాతావరణ మార్పులతో ముడిపడిన ఈ అధిక ఉష్ణోగ్రతల విపరిణామాలు వెనువెంటనే వ్యవసాయం, ఆరోగ్యంతోపాటు కోట్లాది మంది మధ్యతరగతి ప్రజల జీవనంపైనా దుష్ప్రభావాలు చూపాయి. వడదెబ్బకు జనం పిట్టల్లా రాలిపోయారు. 2025 మేలో అధిక ఉష్ణోగ్రతలు నమోదుకాకుండా అకాలవర్షాలు అడ్డుకున్నాయి. దేశవ్యాప్తంగా మెజారిటీ రాష్ట్రాల్లో వర్షాలు పడ్డాయి. పలు చోట్ల కుండపోత వర్షాలు కురిశాయి. వాతావరణ చక్రంలో మార్పుల కారణంగానే మేలో వేడిమి మటుమాయమై చల్లదనం వచ్చి చేరిందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. చల్లదనం అత్యధిక రోజులు కొనసాగడంతో అది అంతిమంగా ఎండకాలం ముగింపునకు ముందస్తు నాంది పలికిందని నిపుణులు విశ్లేషించారు.

### మరెన్నో కారణాలు..

వర్షాకాలం ఈసారి ముందస్తుగా ముంచుకురావడం సైతం ఎండకాలం తీవ్రతను తగ్గించేసింది. వాతావరణంలో ముందస్తుగా తేమ శాతం పెరగడం, చల్లని గాలుల క్రమానుగతిలో మార్పులు సైతం ఉష్ణోగ్రత అధికం కాకుండా అడ్డుకున్నాయి. దీంతో వేసవికాలంలో వేడి తగ్గిపోయింది. గతంతో పోలిస్తే ఈసారి ఎండాకాలంలో వాతావరణం చాలావరకు మేఘావృతమైంది. దాంతోపాటు దేశంలో మేనెలలో ప్రతిరోజూ ఏదోఒక చోట వర్షాలు పడుతూ సగటు ఉష్ణోగ్రత పెరగకుండా నిలువరించాయి. ఈ చల్లదన పరిస్థితులు పరోక్షంగా ప్రభుత్వాల మీదా పెనుభారాన్ని ఒక్కసారిగా దించేశాయి. విద్యుత్ డిమాండ్ పెరగకుండా అడ్డుకున్నాయి.

### ముందుకొచ్చిన కొత్త ధోరణి

ఉడికించే ఉష్ణోగ్రతలు ఉన్నపళంగా తగ్గిపోవడం కొన్ని రకాల పంటల దిగుబడిపైనా ప్రభావం చూపుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. చక్కటి వేడి పరిస్థితుల్లోనే కొన్నిరకాల పంటలు ఏపుగా పెరిగే పరిస్థితులు ఉంటాయని, ఈసారి ఎండలు ఇలా వచ్చి అలా వెళ్లిపోవడంతో ఆయా పంటల సాగుఫలంపై ప్రతికూల ప్రభావం పడొచ్చని వ్యవసాయరంగ నిపుణులు చెబుతున్నారు. ఈసారి మారిన ఈ పరిస్థితులకు తగ్గట్లు కర్షకులు తమ పంటల విత్తునాటడం మొదలు ఎరువులు, పురుగుమందులు చల్లడం దాకా ప్రతిదాంట్లో కాస్తంత సమయపాలన పాటించడం తప్పనిసరి అయిందని వాళ్లు చెబుతున్నారు. హఠాత్తుగా ఎండాకాలం వ్యవధి తగ్గి వర్షాలు మొదలవడంపై వాతావరణ విభాగం సైతం వాతావరణ ముందస్తు అంచనాల వ్యూహాలకు పదునుపెట్టింది.

## అవని కుదుపులతో శాటిలైట్ కమ్యూనికేషన్లకు అంతరాయం

### భూకంప ప్రభావం అంతరిక్షంలో!!

### భవిష్యత్ శాస్త్రీయ ప్రయోగాలకు అవరోధం!

### కొత్త విషయాలను వెల్లడిస్తున్న జపాన్ శాస్త్రవేత్తల నూతన అధ్యయనం



పట్టాలపై రైలు పరుగులు తీస్తుంటే.. హఠాత్తుగా ముందున్న ఇంజిన్ కాస్తంత నెమ్మదించినా వెనకాలే క్యూ కట్టిన బోగీలన్నీ టపటపా ఢీకొన్నంత పనిచేస్తాయి. ఎందుకంటే ప్రతి బోగీ పక్క బోగీతో అనుసంధానమై ఉంటుంది. కానీ ఎలాంటి అనుసంధానంలేని సుదూర శాటిలైట్లు సైతం భూకంపం వేళ ప్రభావితం అవుతున్నాయని తాజా అధ్యయనంలో తేలింది. భూకంపం ధాటికి భూకంపకేంద్ర సమీప భవనాలు, భవంతులు పేకమేడల్లా కదలిపోవడం చూస్తుంటాం. కానీ ఆకాశంలో ఉండే కృత్రిమ ఉపగ్రహాల పనితీరు సైతం భూకంపాల తీవ్రతకు లోనవుతోందని తాజా పరిశోధనలో తేలింది. భౌతికంగా భూమితో అనుసంధానంకాని ఉపగ్రహాలకు భూకంప పర్యవసానాలకు మధ్య గల సంబంధాన్ని తొలిసారిగా ఈ పరిశోధన ఆవిష్కరించింది. జపాన్‌లోని నగోయా విశ్వవిద్యాలయంలోని శాస్త్రవేత్తల బృందం చేసిన ఈ పరిశోధనా తాలూకు వివరాలు ‘ఎర్త్, ప్లానెట్స్, స్పేస్’జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

### భూతలం సహా గగనతలం..

రెండు భూఫలకాల కొనల వద్ద రాపిడి, ఢీకొనే సందర్భాల్లో భూకంపం సంభవిస్తుంది. ఇవి భూతల వనరులనే కాదు గగనతల కృత్రిమ వనరులైన శాటిలైట్లనూ ప్రభావితం చేస్తాయని అధ్యయనకారుల్లో అనుమానం మొదలైంది. ఈ అనుమానాన్ని నివృత్తిచేసుకునేందుకు గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్(జీఎన్ఎస్ఎస్)లోని 4,500కుపైగా రిసీవర్ల ద్వారా సమగ్ర సమాచారాన్ని తెప్పించుకుని ఆ డేటాతో త్రిమితీయ(3డీ) “వాతావరణ ఇబ్బందుల”ముఖచిత్రాన్ని రూపొందించారు. 2024 జనవరి ఒకటో తేదీన జపాన్‌లోని ఇషికావా ప్రిఫెక్చర్‌లోని నోటో ద్వీపకల్పంలో రిక్టార్ స్కేల్‌పై 7.5 తీవ్రతతో సంభవించిన భారీ భూకంపం సంభవించింది. అప్పుడు ఆకాశంలోకి సంక్లిష్టమైన ధ్వని తరంగాలు దూసుకెళ్లాయి. ఇవి భూమి నుంచి ఆకాశంలో 60 నుంచి 1,000 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉన్న అయనో ఆవరణం(ఐనోస్ఫియర్)లోకి వెళ్లాయి. అక్కడి స్వేచ్ఛాయుత ఎలక్ట్రాన్లతో నిండిన వాయువులను ఈ ధ్వనితరంగాలు విపరీతంగా ప్రేరేపించాయి. దాంతో ఈ వాయువులు కింద పొర అయిన థర్మోస్ఫియర్ వాతావరణంలోకి కొంత శక్తిని విడుదలచేశాయి. అప్పటికే థర్మోస్ఫియర్ ఆవరణలో స్థిరంగా ఉన్న శాటిలైట్లపై ఈ అదనపు శక్తి ప్రతికూల ప్రభావం చూపింది. దీంతో శాటిలైట్ల నుంచి భూమి మీదకు జరగాల్సిన కమ్యూనికేషన్ సిగ్నళ్ల ప్రసరణ వేగంలో మార్పులు కనిపించాయి. సిగ్నళ్లు ఆలస్యంగా రావడంతోపాటు సిగ్నళ్లలో సాంద్రత సైతం తగ్గిపోయినట్లు గుర్తించారు. టోమోగ్రఫీ సాయంతో వైద్యరంగంలో వాడే సీటీ స్కాన్ తరహాలో వేర్వేరు కోణాల్లో శాటిలైట్ల డేటాను క్రోడీకరించి 3డీ చిత్రాలను రూపొందించారు. భూకంపం సంభవించినప్పుడు కేవలం పది నిమిషాల వ్యవధిలోనే ధ్వని తరంగాలు ఐనోఆవరణను చేరిపోతున్నాయి. ప్రశాంత కొలనులో రాయి విసిరితే ఏర్పడే వలయాకార అలల్లా ధ్వని తరంగాలు ఐనోస్ఫియర్‌లోకి వెళ్తున్నాయి. భూకంపం సంభవించినప్పుడు భూఫలకాలు ఢీకొన్న ఒక్క ప్రాంతంలోనే ధ్వని తరంగాలు ఉద్భవిస్తాయని గతంలో భావించారు. అలాకాకుండా నోటో ద్వీపకల్ప ఘటనలో 150 కిలోమీటర్ల పొడవునా రెండు భూఫలకాలు ఢీకొన్న చోట్ల నుంచి ధ్వనితరంగాలు పుట్టుకొచ్చాయని, ఇలాంటి సందర్భాల్లోనే అధిక తరంగాలు ఉద్భవిస్తున్నాయని ఈ పరిశోధనలో ముఖ్య రచయిత డాక్టర్ వెజియాంగ్ ఫూ చెప్పారు.

### పలు సమస్యలు..

థర్మోస్ఫియర్‌పై అదనపు ఒత్తిడితో శాటిలైట్ల నుంచి ప్రసారాల నాణ్యత తగ్గిపోవడంతో గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్(జీపీఎస్), శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భూకంపాలతో ఉపగ్రహాల పనితీరూ దెబ్బతింటుందని స్పష్టంగా అర్థమైందని మరో రచయిత, ప్రొఫెసర్ యుచీ ఒట్సుకీ చెప్పారు. భూకంపాల ముందస్తు హెచ్చరికల వ్యవస్థను మరింత పటిష్టచేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని యుచీ అభిప్రాయపడ్డారు. భూకంపాలతోపాటు సునామీ, అగ్నిపర్వతాల విస్ఫోటం వంటి అత్యంత తీవ్ర వాతావరణ పరిస్థితులకూ తమ అధ్యయన మోడళ్లను అన్వయించి మరింత విస్తృతస్థాయి అవగాహనకు ప్రయత్నిస్తున్నామని పరిశోధకులు వెల్లడించారు.

## సంయమనం అవసరం





నెత్తురు చిందకుండా, నష్టం జరగకుండా యుద్ధం సాగుతుందనీ, ముగుస్తుందనీ ఎవరూ అనుకోరు. ప్రత్యర్థిని చిత్తు చేద్దామని ఇరుపక్షాలూ విశ్వప్రయత్నం చేస్తాయి. కానీ అనేక కారణాలవల్ల ఎవరో ఒకరినే విజయం వరిస్తుంది. ఇందులో సరైన అంచనాలకు రాలేకపోవటం దగ్గరనుంచి స్థానిక వాతావరణ స్థితిగతుల వరకూ చాలా వుంటాయి. ఈ సంగతి తెలిసి కూడా మన విపక్షాలు, ప్రత్యేకించి కాంగ్రెస్ మొన్నటి ‘ఆపరేషన్ సిందూర్’లో మనకు కలిగిన నష్టాలగురించి వెంటనే వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నాయి. యాదృచ్ఛికంగానే కావొచ్చుగానీ... మన రక్షణ దళాల చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్ శనివారం సింగపూర్‌లో మాట్లాడుతూ మన దళాలు చేసిన కొన్ని ‘వ్యూహాత్మక తప్పిదాల’ కారణంగా జెట్ విమానాలు కోల్పోయామని చెప్పటం వివాదాస్పదమైంది. ఆ అంశాన్ని ప్రభుత్వ పెద్దలకు వదలటం లేదా వారితో చర్చించి ఎప్పుడు ఏ విధంగా చెప్పాలో సలహా తీసుకోవటం సరైన విధానం. విదేశీ గడ్డపై చెప్పటమైతే ఎంతమాత్రమూ సరికాదు. పైగా ఆయన సింగపూర్ వెళ్లింది ఏటా జరిగే అంతర్ ప్రభుత్వాల భద్రతా వ్యవహారాలపై నిర్వహించే ‘షాంగ్రీ లా డైలాగ్’ కోసం. అందులో పాకిస్తాన్ త్రివిధ దళాల చీఫ్ కూడా పాల్గొన్నారు. ఒకపక్క మన ఎంపీల అఖిలపక్ష బృందాలు పాకిస్తాన్ ఆగడాల గురించీ, వాటిని నిలువరించక తప్పని స్థితి గురించీ వివరించటానికి వేర్వేరు దేశాల్లో పర్యటిస్తున్నాయి. కనుక జనరల్ చౌహాన్ ప్రకటన ఏ రకంగా చూసినా సమయం, సందర్భం లేనిది. కొందరు మాజీ సైనికాధికారులూ, నిపుణులూ చెప్పినట్టు పాకిస్తాన్‌కు మన దళాలు కలిగించిన భారీ నష్టంతోపాటు దీన్నీ చెప్పివుంటే ఇంత వివాదమయ్యేది కాదేమో! గత నెల 7 నుంచి పదో తేదీ వరకూ సాగించిన దాడుల్లో మన నష్టం ఏపాటో చెప్పాలని విపక్షాలు కోరుతున్నాయి. దాడి చేయటానికొచ్చిన రఫేల్ యుద్ధ విమానాలను కూల్చేశామని పాకిస్తాన్ ప్రభుత్వం చేసిన ప్రచారం ఆధారంగా కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఈ డిమాండ్ మొదలుపెట్టారు. మన సైనిక దళాలు సాధిస్తున్న విజయాలను ఎన్డీయే ప్రభుత్వం తన సత్తాకు ప్రతీకగా చెప్పుకోవటాన్ని నిరోధించేందుకు విపక్షాలు ఈ ప్రయత్నం చేసివుండొచ్చు. కానీ ఎప్పుడు ఎక్కడ ఎలా దాడిచేయాలనే అంశాలను పూర్తిగా త్రివిధ దళాలకు అప్పగించాక వాటిపై అనుకూలంగా లేదా వ్యతిరేకంగా మాట్లాడటం ఎవరు చేసినా తప్పే. యుద్ధంలో తొలి క్షతగాత్ర సత్యమేనంటారు. ఎందుకంటే అవతలి పక్షాన్ని చావుదెబ్బ తీశామని, అనేకమంది శత్రు సైనికుల్ని హతమార్చామని, కీలక స్థావరాలు ధ్వంసం చేశామని ప్రభుత్వాలు చెప్పటం ప్రపంచంలో ఎక్కడైనా వున్నదే. యుద్ధం ముగిసిన కొన్నాళ్లకుగానీ వాస్తవ గణాంకాలు బయటకు రావు. మన విపక్షాలు అంతవరకూ ఆగలేకపోయాయి. పాక్ మీడియా వార్తల్ని విశ్వసించి మన ప్రభుత్వాన్ని నిలదీయటం మొదలుపెట్టాయి. ఇదంతా రాజకీయంగా బీజేపీకి లాభిస్తుందన్న ఆందోళనే దీనికి కారణం. ఎప్పుడూ లేనివిధంగా ‘ఆపరేషన్ సిందూర్’ సమయంలో సామాజిక మాధ్యమాల్లో, చానెళ్లలో మన సేనలు పాకిస్తాన్ నగరాలను నేలమట్టం చేయటం మొదలుకొని పలు విజయాలు సాధించినట్టు ప్రచారం సాగింది. ఇదెంత ముదిరిందంటే... ఒక దశలో మన ప్రభుత్వం ఖండించాల్సి వచ్చింది కూడా. మరోపక్క యుద్ధంవల్ల కలిగే అనర్థాల గురించి చెప్పిన మాజీ సైనికాధికారులనూ, వారి కుటుంబసభ్యులనూ దూషించటం, ఉగ్రవాదుల దుర్మార్గానికి భర్తను కోల్పోయిన యువతి ముస్లింలపై ద్వేషం వద్దని అన్నందుకు ఆమెను దుర్భాషలాడటం వంటి వైపరీత్యాలూ చోటుచేసుకున్నాయి. కొందరైతే దాడులు నిలిపేస్తున్నట్టు ప్రకటించిన మన విదేశాంగ శాఖ కార్యదర్శిపైనా, ఆయన కుటుంబసభ్యులపైనా నోరుపారేసుకున్నారు. యుద్ధకాలంలో ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఇచ్చే సూచనలనూ, సలహాలనూ పాటించటం తప్ప ఉన్మాదం ఆవహించినట్టు ఊగిపోవటం సరైంది కాదు. ఇందువల్ల మన జవాన్లకు వీసమెత్తు ఉపయోగం లేదు సరికదా... ప్రజల్లో తప్పుడు భావాలు వ్యాప్తి చెందే ప్రమాదం వుంటుంది. దాడులు ఎప్పుడు మొదలెట్టాలో, ఎప్పుడు ఆపాలో, ఏ దశలో ఏం చేయాలో నిర్ణయించటానికి ప్రభుత్వం ఉన్నప్పుడు గుంపులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించటం అనర్థదాయకం. చౌహాన్ చెబుతున్న ప్రకారం నాలుగు రోజుల దాడుల్లో తొలి రెండు రోజులూ మనకు నష్టం వాటిల్లింది. వెంటనే లోపాలు గుర్తించి సరిచేసుకోవటం పర్యవసానంగా ఆ తర్వాత మన జెట్ విమానాలు శత్రు స్థావరాలను ధ్వంసం చేయగలిగాయని ఆయన అన్నారు. ఏ లోపమూ చోటుచేసుకోకుండా, ఏ నష్టమూ జరగకుండా మనం కోరుకున్న ప్రకారం అంతా జరిగిపోవాలనుకునేవారికి ఇది నిరాశ కలిగించవచ్చు. బీజేపీ అగ్ర నాయకులంతా ఈ విజయాలను తమ వ్యక్తిగత ఖాతాలో వేసుకోవటం కాంగ్రెస్ పార్టీకి కంటగింపు కావొచ్చు. కానీ దేశ రక్షణకు సంబంధించిన అంశాల్లో సంయమనం పాటించటం అందరి బాధ్యత. దాడులు ప్రారంభించటానికి ముందు అఖిలపక్ష సమావేశం నిర్వహించి వారి మద్దతు కోరిన ప్రభుత్వం ముగించటానికి ముందు కూడా ఆ పనే చేసివుంటే బాగుండేది. కనీసం మన దళాలు సాధించిన విజయాలు, మన నష్టాల గురించి ఈ నెల్నాళ్లలోనైనా అఖిలపక్షం నిర్వహిస్తే సమస్య తలెత్తేది కాదు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఈ తరహా ఉదంతాలు ఇకపై పునరావృతం కాకూడదనుకుంటే కేంద్రం ఆ పని చేయాలి. అందులో అధికార, విపక్షాల వ్యవహారశైలి గురించీ, కొన్ని శక్తులనుంచి అతిగా వచ్చిన స్పందనల గురించీ తన వైఖరేమిటో చెప్పాలి. కష్టకాలంలో సంయమనం పాటించటం ఎంత ముఖ్యమో వివరించాలి.

## ప్రత్యేక పార్లమెంట్ సమావేశం కోరుతూ ప్రధాని మోడీకి లేఖ



న్యూఢిల్లీ : ఆపరేషన్ సిందూర్‌పై ప్రత్యేక పార్లమెంట్ సమావేశాన్ని నిర్వహించాలంటూ ఇండియా బ్లాక్ ప్రధాని మోడీకి లేఖ రాసింది. మంగళవారం న్యూఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీ, శివసేన (యుబిటి), ఆర్‌జెడి సహా పలువురు ప్రతిపక్ష నేతలు పాల్గన్నారు. ప్రధానికి రాసిన లేఖలో పలువురు ఇండియా బ్లాక్ ఎంపిలు సంతకం చేశారు. కాంగ్రెస్ నేత జైరాంరమేష్, దీపేంద్ర హుడా, టిఎంసి నేత డెరెక్ ఒబ్రెయిన్, ఎస్‌పికి చెందిన రాంగోపాల్ యాదవ్, ఆర్‌జెడి మనోజ్ ఝా, శివసేన (యుబిటి) నేత సంజరు రౌత్ సమావేశానికి హాజరయ్యారు. డిఎంకె ఎంపి కూడా ఈ లేఖపై సంతకం చేశారు. అయితే కరుణానిధి జయంత్రి సందర్భంగా సమావేశంలో పాల్గలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. నేషనల్ కాన్ఫరెన్స్, సిపిఐ(ఎం), ఐయుఎంఎల్, సిపిఐ, ఆర్ ఎస్‌పి, విదుతలై చిరుతైగల్ కచ్చి (విసికె), సిపిఐ(ఎంఎల్) లిబరేషన్‌లు కూడా ఈలేఖపై సంతకాలు చేసినట్లు ప్రతిపక్ష నేతలు తెలిపారు. ఈ సమావేశానికి ఆప్ హాజరుకాలేదు. అయితే ప్రత్యేక సమావేశానప్పి డిమాండ్ చేస్తున్న పార్టీల్లో నేషనలిస్ట్ కాంగ్రెస్ (ఎన్‌సి) లేదు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ గురించి ఎమ్మెల్యేలు, ఎంపిలకు వివరించాలని ఇండియా బ్లాక్ కోరుతోంది.

## టారిఫ్‌ల ఒప్పందాన్ని పూర్తిగా ఉల్లంఘించిన అమెరికా




బీజింగ్ : అమెరికా చర్యలు టారిఫ్‌ల తగ్గింపు ఒప్పందాన్ని పూర్తిగా ఉల్లంఘిస్తున్నాయని చైనా మండిపడింది. ఎఐ చిప్ ఎగుమతుల నియంత్రణపై మార్గదర్శకాలను జారీ చేయడం, చైనాకు చిప్ డిజైన్ సాఫ్ట్‌వేర్‌ను నిలిపివేయడం మరియు చైనా విద్యార్థి వీసాలను రద్దు చేయాలన్న నిర్ణయించడం వంటి చైనా ప్రయోజనాలకు హాని కలిగించే చర్యలని మండిపడింది. ఈ చర్యలు ఏకాభిప్రాయాన్ని పూర్తిగా ఉల్లంఘిస్తున్నాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇరుదేశాల మధ్య నిలిచిపోయిన వాణిజ్యాన్ని తిరిగి ప్రారంభించేందుకు ఇటీవల భారీ సుంకాలను తగ్గించడానికి అంగీకరించిన చైనా-అమెరికా ఉమ్మడి ప్రకటనను వాణిజ్య శాఖ ప్రస్తావించింది. "అమెరికా ఏకపక్షంగా కొత్త ఆర్థిక మరియు వాణిజ్య ఘర్షణలను రెచ్చగొట్టింది. ద్వైపాక్షిక ఆర్థిక మరియు వాణిజ్య సంబంధాలలో అనిశ్చితి మరియు అస్థిరతను మరింత తీవ్రతరం చేసింది" అని వాణిజ్యశాఖ ప్రకటనలో పేర్కొంది. చైనా తన నిబద్ధతకు కట్టుబడి ఉందని తెలిపింది. తన చట్టబద్ధమైన హక్కులు మరియు ప్రయోజనాలను కాపాడుకోవడానికి ధృడమైన నిశ్చయంతో బలమైన చర్యలు తీసుకుంటుందని పేర్కొంది. ఈ చర్యలకు తగిన ప్రతీకారం తీర్చుకుంటామని అమెరికాను హెచ్చరించింది. గతవారం ట్రంప్ అమెరికాలో చదువుతున్న చైనా విద్యార్థుల వీసాలను రద్దు చేయనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. చైనా నుండి 2,75,000మందికి పైగా విద్యార్థులు అమెరికా క్యాంపస్‌ల్లో చదువుతున్నారు. జెనీవాలో ఉన్నత అధికారుల మధ్య జరిగిన చర్చల తర్వాత బీజింగ్, వాషింగ్టన్ గత నెలలో 90 రోజుల పాటు ఒకరిపై ఒకరు విధించుకున్న అధిక సుంకాలను తగ్గించుకునేందుకు అంగీకరించాయి. చైనా ఒప్పందాన్ని నెమ్మదిస్తోంది అని అమెరికా వాణిజ్య కార్యదర్శి హొవార్డ్ లుట్నిక్ పేర్కొనడంపై చైనా ఆగ్రహం వ్యక్తం చేసింది.

## జల రవాణలో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం



అమరావతి : రాష్ట్రంలో జలరవాణాలో అధిక పెట్టుబడులు ఆకర్షణే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బి.సి జనార్ధన్‌రెడ్డి అన్నారు. జలరవాణా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఎపి ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పున్నమి ఘాట్‌లో బోట్ మారథాన్ కార్యక్రమాన్ని మంత్రి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు రవాణా కంటే దాదాపు 50 శాతం తక్కువ ఖర్చుతో సరుకు రవాణా అవుతుందని చెప్పారు. దేశంలో రెండవ అతిపెద్ద తీర ప్రాంతం కలిగిన రాష్ట్రంలో 1,555 కిలో మీటర్ల పరిధిలో నామిగేషన్‌కు అనుకూల జల మార్గాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. వీటిలో 900 కిలో మీటర్ల వరకూ జాతీయ జల మార్గాలు ఉండటం విశేషమన్నారు. ఈ జల మార్గాలతో పోర్ట్ కనెక్టివిటీ పెరుగుతుందని తెలిపారు. మరోవైపు పర్యాటకానికి ఊతమిస్తుందన్నారు. పిపిపి మోడల్‌లో ఆయా ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామన్నారు. ఇన్‌లాండ్ క్రూయిజ్ టూరిజంను ప్రోత్సహించడం ప్రభుత్వ వ్యూహమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ జడ్.శివప్రసాద్, ఎపి టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఎపి మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఇన్‌లాండ్ వాటర్ వేస్ సిఇ రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

## బుగ్గమఠం భూముల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు



న్యూఢిల్లీ : బుగ్గమఠం భూముల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది. బుగ్గమఠం భూముల అంశంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజరు కరోల్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లోగా పెద్దిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సమాధానం చెప్పాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వం ఇచ్చిన కౌంటర్ పై వారం రోజుల్లోగా పిటిషనర్ రిజయిండర్ దాఖలు చేయాలని ధర్మాసనం గడువు ఇచ్చింది. అప్పటివరకు భూములపై యధాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని సుప్రీం ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

## 'తను వేదికపై తెలిపింది నిరసన కాదు నిజాన్ని'




'బాంబుల పొగ, దు:ఖపు సెగ' ఏడాదిన్నరగా పాలస్తీనా కథ ఇది. ఈ కథకు కారాణాలను ప్రశ్నించిందా విద్యార్థిని. ఈ విధ్యంసానికి మన మద్దతు ఎందుకు అని గర్జించింది. ఆ వికృత గీతానికి మనం ఎందుకు స్వరాలు కూర్చటమని నిలదీసింది. పాలస్తీనా మాటెత్తితే చాలు, ఏకంగా యూనివర్సిటీలపైనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉక్కుపాదం మోపుతున్న వేళ.. భారత సంతతి విద్యార్థిని మేఘ వేమూరి అదే అమెరికా నడిబోడ్డున నిజాలను నిగ్గదీసింది. కేంబ్రిడ్జ్‌లోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) గ్రాడ్యుయేషన్ సెర్మన్ వేదిక నుంచి ఏకంగా పాలస్తీనాకు మాటలతోనే కాదు, రూపంతో కూడా సంఘీభావంగా నిలిచింది. పాలస్తీనా అంతటా కమ్ముకున్న కారుమబ్బులను చీలుస్తూ ఆమె మాటలు తూటాల్లా తాకాల్సిన వారికి గట్టిగానే తాకాయి. ఇప్పుడు ఆ ధిక్కార స్వరం ప్రపంచమంతటా ప్రతిధ్వనిస్తోంది. అందుకే ఆగమేఘాల మీద ఆమెపై చర్యలకు ఉపక్రమించారు. 'విస్తరించిన మౌనాలు ప్రేక్షక పాత్ర వహిస్తున్న కాలంలో, ఆకృత్యాలు రక్తమోడు తూనే ఉన్నాయి. గుండెలన్నీ చుట్టూ ఉన్నా కొట్టుకోవటం మరచిపోయాయా! అమానవీయతను చుట్టుకు న్నాయా?' అని ఆవేదన చెందుతాడోకవి. నిజమే, మన కండ్లముందు జరగకూడనివి, దుర్మార్గమైనవి జరుగుతున్నప్పుడు మౌనంగా ఎలా ఉండగలం! మౌనంగా ఉండి మనుషులం ఎలా కాగలం! ఈ మౌన సంస్కృతిని ఛేదించకపోతే మారాలని కోరుకుంటున్న సమాజం ఎలా మారుతుంది. మనుషులు ఇంత శక్తి హీనంగా చైతన్య రహితంగా ఎందుకు మారారు? ఇదే రేపు మనకూ ఎదురైతే! మనదాకా వచ్చినప్పుడు ఎవరుంటారు, ఎవరింటారు! మనల్ని మనం వెన్నుపై చరచుకుని మెలుకువ తెచ్చుకోవాల్సిన సమయం ఇది. ఇప్పుడు ఆ వెన్ను చరిచే పనే మేఘా చేసింది.

"పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడికి అమెరికా మాత్రమే కాదు, మన యూనివర్సిటీ కూడా సాయం చేస్తోంది. వాటిని ప్రోత్సహిస్తోంది" అంటూ ఆమె కమెన్స్‌మెంట్ సెర్మనీ వేదికగా కుండబద్దలు కొట్టింది. ఏ మాత్రం బెరుకు లేకుండా "ఎంఐటీ విద్యార్థులు స్వేచ్ఛాయుత పాలస్తీనాను కోరుకుంటున్నారు. ఒక జాతి విధ్వంసాన్ని విద్యార్థులు సహించలేరు. మా జీవితాలను శాస్త్రవేత్తలుగా, ఇంజనీర్లు, విద్యావేత్తలు, నాయకులుగా తీర్చిదిద్దుకుంటాం. అలాగే ఆయుధ నిషేధానికి పిలుపునిచ్చేందుకు కూడా మేం అంతే కట్టుబడి ఉన్నాం. ఎంఐటీ విద్యార్థులుగా ఇజ్రాయిల్‌తో సంబంధాలను తెంచుకోవాలని వర్సిటీని డిమాండ్ చేస్తూనే ఉంటాం" అంటూ మేఘంలా గర్జించింది. అమెరికా ఇజ్రాయిల్ విద్యావ్యవస్థల ద్వంద్వ స్వభావాన్ని మేఘా ప్రపంచం ముందు ఎండగట్టింది. క్రమక్రమంగా కోల్పోతున్న ప్రపంచ ఆధిపత్యాన్ని తిరిగి పొందడానికి అమెరికా అధ్యక్షుడు బరితెగిస్తూ విపరీత చర్యలు ప్రకటిస్తుంటే, అదే గడ్డపై నిలిచి అమెరికా విద్యాల యాల పరిశోధనలు ఇజ్రాయిల్ హింసోన్మాదానికి ఎలా సహకరిస్తున్నాయో ఎలుగెత్తి ప్రపంచానికి చాటడం చిన్న విషయం కాదు. విశ్వగురువు సైతం జీ హుజూర్ అంటూ సాకిలపడిన కొండను ఢకొట్టింది మేఘా వేమూరి. తన వ్యక్తిగత భవిష్యత్తును ఫణంగా పెట్టి మరీ ఆమె ఈ సాహసానికి పూనుకుంది. ప్రస్తుతం అమెరికా వ్యాప్తంగా విద్యాసంస్థలపై అనిశ్చితి చీకట్లు కమ్ముకున్నాయన్నది బహిరంగ రహస్యమే. తర్వాత ఏం జరగనుందనే అందరి మనస్సులోని ప్రశ్నలకు ఆమె ప్రతి రూపమై ధ్వనిస్తోంది. విద్యాలయాల్లో భిన్న దృక్పధాలు, ప్రశ్నించేతత్వం లేకుండా విజ్ఞానం వికసించదు. కళ్లెదురుగా జరుగుతున్న దుర్మార్గాలను, అన్యాయాలను, వాటి మూలాలను పరిశోధించడం, తమ అభిప్రాయాలను స్పష్టంగా ప్రకటించడం విద్యకు ఉండాల్సిన ప్రాథమిక లక్షణాలని మేఘా అభిప్రాయం. అదే నేడు ఆచరణలో చూపింది. ఆ మాత్రపు ప్రశ్నను కూడా ప్రపంచంలోని అనేక దేశాధినేతలు, వారి అనుయాయులు సహించలేకపోవడం, వణికిపోవడం వారి భయాందోళనలనే సూచిస్తోంది. కొద్ది నెలల క్రితం అమెరికాలోని ప్రిన్‌టన్ యూనివర్సిటీలో పాలస్తీనాకు సంఘీభావంగా ప్రదర్శనలో పాల్గన్న నూట పది మంది విద్యార్థులను అరెస్టు చేసిన విషయం ఆమెకు తెలియనిదేమీ కాదు. అయినా వెరువని ధీర ఆమె. యేటికి ఎదురీదేవాళ్లు కొందరుంటారు మేఘాలా. వాళ్లు తామెంతగా నష్టపోయినా, ఎన్ని ఇక్కట్లకు గురయినా, ఎన్ని సవాళ్లు ఎదురయినా విలువల అడుగులపైనే నిలబడి ఉంటారు. వారు అరుదుగా కనిపించవచ్చు. కానీ, అలాంటి వాళ్లే నేడు సమాజానికి అవసరం. 'తను వేదికపై తెలిపింది నిరసన కాదు నిజాన్ని' అని మరింత గట్టిగా చెబుతుంది. జెనోసైడ్‌లో పాలుపంచుకున్న సంస్థ వేదికపై నేను నడవడానికి కూడా ఇష్టపడటం లేదని సూటిగా స్పష్టంగా తేల్చి చెప్పింది. ప్రశ్నించడం రాని చదువుకు పదునుండదు. సత్యం ధ్వనించని శబ్ధంలో శక్తి నిండదు. కాబట్టే స్వేచ్ఛా స్వరాలు తమ దారిని తాము వెతుక్కుంటాయి. ముళ్లూ రాల్లూ ఎన్నున్నా ముందుకుపోయే అడుగులుంటాయి. అలాంటి అడుగే మేఘా వేమూరి వేసింది.

## సైకిల్‌తో ఆరోగ్యానికి లింకు!



బాల్యంలో సైకిల్‌ను అబ్బురంగా చూసి, మురిసి, నడిపించే ప్రయత్నాలు చేసి, అనుబంధాన్ని పెంచుకొని, గాయాలు చేసుకొన్న గుర్తులు ఎన్నెన్నో. సామాన్యుడి పుష్పక విమానం, పేదోడి రవాణా ద్విచక్ర వాహనం సైకిల్ లేదా బైసికిల్. అందరికీ అందుబాటు ధరల్లో లభించే ఘన చరిత్ర సైకిల్‌ది. చూడడానికి సరళంగా కనిపిస్తూ, యజమాని ఆరోగ్యాన్ని కాపాడుతూ, పర్యావరణ పరిరక్షణకు గొడుగులు పడుతూ, సంతోషాల విందులు వడ్డిస్తూ, ప్రకృతి అందాలను పరిచయం చేస్తూ, పరిశుద్ధ గాలిని అందిస్తూ, హరిత అభివృద్ధికి దోహదపడుతూ, సాహస క్రీడలకు ఉపకరిస్తూ మనకుటుంబాలతో అమూల్య బంధాలను పెనవేసుకున్నది మనం అమితంగా ప్రేమించే సైకిల్. మానవాళికి పలురకాల అమూల్య సేవలను అందిస్తున్న సైకిల్ ప్రాధాన్యాన్ని గుర్తించిన ఐరాస 2018లో తీసుకున్న తీర్మానం ప్రకారం ఏటా 03 జూన్ రోజున ప్రపంచ సైకిల్ దినోత్సవం లేదా వరల్డ్ బైసికిల్ డే పాటించడం ఆనవాయితీగా మారింది. శిలాజ ఇంధనాలను వినియోగించే మోటారు సైకిల్ లేదా బైక్, కారు, బస్సు లాంటి వాహనాల వినియోగం పెరగడంతో పర్యావరణంలో కార్బన్ ఉద్గారాల పెరిగి భూతాపం లాంటి పలు విపత్తులకు దారి తీస్తున్న వేళ, మనకు ఆరోగ్య ప్రదాయిగానే కాకుండా పర్యావరణ హితం కోసం ఉపయోగపడుతున్న సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించడం, ఇతర వాహనాల వినియోగాన్ని తగ్గించడం, సుస్థిరాభివృద్ధికి ఉపయోగపడడం, రేపటి తరానికి సైకిల్ ఉపయోగాలను వివరించడం లాంటి లక్ష్యాలను ప్రపంచ సైకిల్ దినోత్సవం వేదికలు దోహదపడుతున్నాయి. 2025 ప్రపంచ సైకిల్ దినం ఇతివృత్తంగా ఆరోగ్యం, సమానత్వం, సుస్థిరాభివృద్ధికి సైకిల్ వినియోగం అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతోంది. 1817లో 'కార్ల్ వాన్ డ్రైస్' అనే వ్యక్తి సైకిల్‌ను కనుగొని, దానికి 'దండీ హార్స్' లేదా లవ్‌ఫ్‌మెషిన్ లేదా స్విఫ్ట్‌వాకర్ అని నామకరణం చేశాడు. 1880ల్లో బ్రిటీష్ పాలకుల సరదా వాహనంగా భారత్‌లోకి ప్రవేశించిన సైకిల్, అనతి కాలంలోనే ప్రజాదరణ పొందడం, 1900 ల్లో మధ్య తరగతి/ అధిక ఆదాయ వర్గాల మన్ననలు పొందింది. 1923లో ముంబాయ్‌లోని యువకులు సాహసోపేతంగా 70,000 కి.మీ సైకిల్ యాత్రను 5 ఏండ్ల పాటు నిర్వహించి ప్రపంచ పర్యాటన చేయడంతో ప్రజల దృష్టి సైకిల్‌పై పడింది. 1930ల్లో భారత ప్రభుత్వం సైక్లింగ్‌ను క్రీడగా భారత సైక్లింగ్ ఫెడరేషన్ వేదిక గుర్తించింది. 1950 ల్లో భారత్‌లో అట్లాస్ సైకిల్స్ తయారీ పరిశ్రమ నెలకొల్పారు. నేడు అన్ని వర్గాల, వయస్సుల వారితో సైకిల్ ఒక విడదీయరాని సంబంధాన్ని ఏర్పరచుకుంది. డిజిటల్ యువతలోనే కాదు, తల్లిదండ్రుల్లో కూడా సైకిల్ పట్ల కొంత నిరాదరణ నెలకొని ఉంది. మోటారు వాహనాల వరదలో సైకిల్



కొట్టుకుపోతున్నది. సైకిల్ చైయిన్ తెగిపోతున్నది. సైకిల్‌పై తల్లిదండ్రులకే ప్రేమ సన్నగిల్లుతున్న వేళ నేటి పిల్లలు, యువత కూడా సైక్లింగ్‌పట్ల ఆసక్తి చూపడం లేదు. మన ఆరోగ్యం కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం ఉపకరిస్తున్న సైకిల్‌కు పూర్వ వైభవం తేవడానికి నేటి పెద్దలు పూనుకోవాలి. రేపటి ఆరోగ్యకర సమాజ స్థాపనకు విత్తులు నాటాలి.

## అసోం పౌరులకు తుపాకులిస్తారా?



సరిహద్దుల్లో అక్రమ చొరబాటుదారుల బారినుంచి తమను తాము రక్షించుకోవడానికి స్థానిక పౌరులకు ఆయుధాలు అందించడానికి అసోం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అత్యంత ప్రమాదకరం, వివాదాస్పదంగా తయారైంది. భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని అసోం రాష్ట్ర ప్రభుత్వం మారుమూల, దుర్బల ప్రాంతాల్లోని స్థానిక పౌరులు స్వయం సమాజాలకు ఆయుధాల వినియోగానికి లైసెన్సులు జారీ చేయడానికి నిర్ణయించింది. బంగ్లాదేశ్‌ను ఆనుకుని ఉన్న సరిహద్దు ప్రాంతాల్లో నివసించే స్వదేశీ సమాజాలు దుర్బలంగా ఉన్నాయని అందువల్ల వారికి ఆయుధాల వినియోగానికి లైసెన్సులు మంజూరు చేస్తే వారికి వ్యక్తిగత భద్రత సమకూరడమే కాక, వారిలో మనోధైర్యం పెరుగుతుందని అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ చెబుతున్నారు. అసోంలోని అంతర్రాష్ట్ర సరిహద్దు సమీపాన గల ప్రజలకు మాత్రం ఈ విధంగా ఆయుధాల లైసెన్సులు జారీ చేయడం జరగదని స్పష్టం చేస్తున్నారు. నిర్దిష్టమైన పౌరసమాజాలకు సాయుధ లైసెన్సులు అందిస్తే విపరీతంగా దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉందన్న వాస్తవాన్ని అసోం ప్రభుత్వం తెలుసుకోవడం లేదు. చట్టపరమైన అధికారానికి, ఆయుధాల వినియోగంపై గుత్తాధిపత్యానికి మధ్య ఉన్న రేఖ చెరిగిపోతుంది. స్థానికులు ఎవరో, స్థానికేతరులెవరో ఎంపిక చేయడం చాలా కష్టం. స్థానికేతరులను మినహాయించి, స్థానికులకే ఆయుధాల లైసెన్సులు అందిస్తే ఒకరిపై ఒకరికి నిఘా, పౌరసమాజాల మధ్య శత్రుత్వం పెరిగిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా ప్రవేశించే వలసదారుల ఏరివేత ప్రభుత్వ చర్యలను మరింత సంక్లిష్టం చేస్తుంది. ప్రైవేట్ వ్యక్తులు గందరగోళంలో పడతారు. ఉల్ఫా వంటి తిరుగుబాటు గ్రూపుల ఆందోళనలు, హింసాత్మక సంఘటనలతో నిత్యం సతమతమయ్యే అసోం రాష్ట్రంలో పౌరుల చేతుల్లోకి ఆయుధాలను విశేషంగా అందిస్తే మరింత హింస పెరుగుతుందే తప్ప తగ్గదు. ఆత్మరక్షణకోసం అని చెప్పుకుంటున్నా వ్యక్తిగత భద్రత పేరుతో ఆయుధాల వినియోగం విపరీతంగా పెరిగిపోతుంది.ద

అక్రమ ఆయుధ ప్రైవేట్ మార్కెట్‌కు ద్వారాలు తెరుస్తాయి. ఇది ఒక విధంగా పౌరులను రక్షించవలసిన ప్రధాన బాధ్యత నుంచి రాష్ట్ర ప్రభుత్వం తప్పుకున్నట్టు అవుతుంది. దుర్బల ప్రాంతాల్లో ప్రభుత్వం తన చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి, భద్రతా ఉనికిని పెంచుకోవడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యామ్నాయం. ఆధునిక రాష్ట్రాల్లో హింసాత్మక సాధనాలపై, ఆయుధాలపై గుత్తాధిపత్యం ప్రభుత్వానికి, అది అమలు చేసే సంస్థల వద్దనే ఉంటుందని అందరికీ తెలుసు. భారతదేశంలో ఆయుధాల లైసెన్సులు నిబంధనల ప్రకారం అత్యంత అవసరం కలిగిన వారికి మాత్రమే జారీ అవుతాయి. ఆయుధ చట్టం 1959, ఆయుధ నిబంధనలు 2016 ప్రకారం వ్యక్తుల స్వీయ రక్షణకు ఆయుధాలను అందించడానికి కఠినతరమైన లైసెన్సింగ్ ప్రక్రియ అమలులో ఉంది. ఈ మేరకు వ్యక్తులను గుర్తించడం ఎంతో రిస్కుతో కూడుకున్నది. చట్టం ప్రకారం తుపాకీలకు లైసెన్సులు ఇవ్వడం, పర్యవేక్షించడం, తిరిగి వాటిని పొందడం ప్రభుత్వానికి కష్టతరం చేస్తాయి. చివరకు తప్పుడు వ్యక్తుల చేతుల్లోకి ఆయుధాలు వెళ్లే ప్రమాదం ఎదురవుతుంది. అసోంలో స్థానిక ప్రజలు అనేక మంది కనీస వసతులు కరువై బతుకుతున్నారు. వీరికి ఆయుధాలను కొనుగోలు చేసే స్తోమత లేదు. సంపన్నులు మాత్రమే వీటిని కొనుగోలు చేయగలరు. అలాగే ఆయుధాల వినియోగంలో శిక్షణ పొందడం, అందులో నైపుణ్యం సాధిస్తేనే స్వీయ రక్షణకు ఆయుధాలను వినియోగించ గలుగుతారు. అసోం రాష్ట్ర ప్రభుత్వం పౌరులకు తుపాకీలు అందిస్తే ఏవైనా ఉద్రిక్తతలు పెరిగినప్పుడు ప్రభుత్వంతో పనిలేకుండా తూటాలతోనే జనం జవాబివ్వడం జరుగుతుంది. గతంలో కూడా 1985 నుంచీ అసోంలో ఆయా ప్రాంతాల వారు తుపాకీ లైసెన్సుల కోసం డిమాండ్ చేస్తున్నా గత ప్రభుత్వాలు సాహసించలేదు. ఇది రాజ్యాంగ విరుద్ధమే కాక హింస పెరుగుతుందనే భయంతో ఈ విషయాన్ని పట్టించుకోలేదు. అందువల్లనే చాలా మంది స్థానిక తెగల వారు స్థానికేతరుల ఒత్తిడి వల్ల ఒత్తిళ్లకు లొంగి భూములు అమ్ముకోవలసి వచ్చిందని అసోం ముఖ్యమంత్రి హిమంత శర్మ ఆరోపించడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. దేశంలో పౌరులకు ఆయుధాల లైసెన్సులు జారీ చేయడం అన్నది మొట్టమొదటిసారి కాదు. జమ్మూకశ్మీర్‌లో విలేజి డిఫెన్స్‌గార్డు (గ్రామ రక్షకులు)గా పౌరులకు ప్రభుత్వం శిక్షణ ఇచ్చింది. అయితే తుపాకీ లైసెన్సులు మంజూరు లోను, వినియోగం లోనూ అవకతవకలు ఎన్నో జరగడంతో ఈ పథకం పక్కదారి పట్టింది. పంజాబ్ ప్రభుత్వం కూడా స్పెషల్ పోలీస్ ఆఫీసర్లుగా ఒకనాడు పౌరులకు శిక్షణ ఇచ్చింది. చత్తీస్‌గఢ్ ప్రభుత్వం నక్సల్స్ హింసను నివారించడానికి 2006లో గిరిజనులను సల్వాజుడుం పేరుతో నిఘా గ్రూపుగా ఏర్పాటు చేసింది. అయితే భారీ ఎత్తున అక్రమ ఆయుధాలను పట్టివేయడం, మానవ హక్కుల ఉల్లంఘన తదితర సంఘనలు చోటు చేసుకోవడంతో సుప్రీం కోర్టు జోక్యం చేసుకుంది. ఇటువంటి అమానవీయ వాతావరణం కల్పించడం యువత పెడదారి పట్టే ప్రమాదం ఉంటుందని హెచ్చరించింది. పుస్తకాలకు బదులు యువతకు తుపాకీలు అందించడం, గార్డులుగా వారిని అడవుల్లో నిలబెట్టి దోపిడీకి అవకాశం ఇచ్చినట్టు అవుతుందని సుప్రీం కోర్టు హెచ్చరించింది. చివరకు దేశ విధ్వంసానికి బాట పరిచినట్టు అవుతుందని వ్యాఖ్యానించింది. సుప్రీం కోర్టు ఇచ్చిన ఈ తీర్పు అసోం ప్రభుత్వానికి కూడా వర్తిస్తుంది. అమెరికా తుపాకీ సంస్కృతిని అసోంలో ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తే ఎన్నో హింసాత్మక సంఘటనలను రాష్ట్రం ఎదుర్కోవలసి వస్తుంది.